ANN తెలుగు

Follow: @ANNTELUGU

13-02-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 73 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టూప్ న్యూస్

## ఆలయాల సందర్శన పూర్తిగా వ్యక్తిగతం



- భక్తుల మనోభావాలు కాపాడాలన్నదే నా ఆవేదన
- తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో దోషులను అరెస్ట్ చేయడం సంతోషం
- కేరళలోని శ్రీ అగస్త్య మహర్షి ఆలయ సందర్శన అనంతరం
- మీడియాతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

02

## ఆర్మీపై అనుచిత వ్యాఖ్యలు.. రాహుల్‌కు లక్నో కోర్టు సమన్లు



- భారత్ జోడో యాత్ర సందర్భంగా ఆర్మీపై రాహుల్ వ్యాఖ్యలు
- సైన్యాన్ని రాహుల్ అవమానించారంటూ బీఆర్‌వో మాజీ డైరెక్టర్ ఫిర్యాదు
- మార్చి 24న తమ ఎదుట హాజరు కావాలని కోర్టు ఆదేశం

02

## రాజ్యసభకు కమల్ హాసన్...!



- తమిళనాడు సీఎం నుంచి స్పష్టమైన హామీ
- దేశం కోసమే తమ పార్టీ కూటమికి మద్దతు ప్రకటించిందని, అప్పట్లో చెప్పిన కమల్ హాసన్

02






అన్నీ ఫ్రీగా ఇస్తే ప్రజలు

## పని చేసేందుకు ఇష్టపడటం లేదు

ఉచిత పథకాలు మంచిది కాదు సుప్రీంకోర్టు

వివరాలు 2లో



## కాంగ్రెస్‌లో చేరిన ప్రణబ్ ముఖర్జీ తనయుడు

- తృణమూల్ కాంగ్రెస్ కు షాక్
- కాంగ్రెస్ వ్యక్తి ఎప్పటికైనా కాంగ్రెస్‌లోకే వస్తాడని వ్యాఖ్య
- కాంగ్రెస్ పార్టీని వీడటం పొరపాటే అన్న అభిజిత్ ముఖర్జీ

వివరాలు 2లో



## కేంద్రమంత్రి షెకావత్‌కు తెలంగాణ బీజేపీ ఎంపీల రిక్వెస్ట్

- సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్రం అధికారికంగా నిర్వహించాలి
- కేంద్రమంత్రి ని కలిసిన ఎంపీలు డి.కె. అరుణ, రఘునందన్ రావు, విశ్వేశ్వర్ రెడ్డి
- దేశంలో 12 కోట్ల బంజారాలు ఉన్నారన్న బీజేపీ ఎంపీలు

వివరాలు 2లో

## లోన్ బకాయి.. రైతు ఇంటి గేటు జప్తు

- డీసీసీబీ అధికారుల చర్యపై రైతు కుటుంబం ఆవేదన
- పాలకుర్తిలో బ్యాంకు అధికారుల తీరుపై విమర్శలు
- రుణ బకాయిల వసూళ్లలో క్రూరంగా వ్యవహరిస్తున్న బ్యాంకులు
- రైతుల సంక్షేమంపై ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు

వివరాలు 2లో



# లోకల్ ఫైట్.. ఇక లేనట్లే

## 42 శాతం రిజర్వేషన్లు తేలాకే

- పార్లమెంట్‌లో చట్టానికి కేంద్రంపై ఒత్తిడి తెస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల వ్యూహాత్మక నిర్ణయం
- విపక్షాలకు కాంగ్రెస్ సర్కార్ షాక్
- ఇన్ ఛార్జీల పాలనలోనే ఇక స్థానిక సంస్థలు
- మరోమారు కులగణన సర్వే చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- 42 శాతం చట్టం చేసి కేంద్రానికి నివేదిస్తాం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు అడ్వాంటేజ్

**హైదరాబాద్, మహా:** స్థానిక ఫైట్ ను రాష్ట్ర సర్కారు పక్కనపెట్టింది. ఎంతో కష్టపడి దేశంలోనే సాహసోపేతంగా కులగణన చేస్తే దీనిని బీసీసంఘాలే సంపూర్ణంగా స్వాగతించకపోవడంతో అందరూ ఆమోదించేవరకు మరో సారి కులగణన సర్వే చేసి 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రానికి వదిలేయాలని సర్కారు డిసైడైంది. స్థానిక ఎన్నికలు వస్తాయని బీసీ నినాదం ఎత్తుకున్న పార్టీలకు ఇది షాక్ గా మారగా, స్థానిక ఎన్నికలు ఇప్పటికిపుడు జరగకపోతే ఇప్పట్లో ఏ ఎన్నికలు జరిగే అవకాశం లేదు. దీంతో స్థానిక పాలన అంతా సర్కారు కనుసన్నల్లోనే నడవనుంది. ఎమ్మెల్యేలే సూపర్ బాస్ లు కానున్నారు.

మిగతా 2లో

### కుల గణన సర్వేపై టోల్ ఫ్రీ నంబర్

రాష్ట్రంలో మరోసారి కుల గణన సర్వే నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఫిబ్రవరి 16 నుంచి 28వ వరకు ఈ సర్వే నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. 3.1 శాతం మంది సర్వేలో పాల్గొనలేదన్న మంత్రి గతంలో నిర్వహించిన సర్వేలో పాల్గొనని వారి కోసమే ఈ సారి నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే కుల గణన సర్వే కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాసనసభలో బిల్ పాస్ చేస్తామని, వెంటనే కేంద్రానికి పంపించి పార్లమెంటులో బిల్ పెట్టిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన కోసం కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు అన్నిని రాజకీయ పార్టీలను కలుస్తామని, ప్రధానమంత్రిని, పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేతను కలిసి బిల్లుకు మద్దతు కోరుతామన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లు పెట్టేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామన్నారు. శాసనసభలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆమోదించిన బిల్లుకు కేంద్రం ఆమోదించినా ఆమోదించకపోయినా మా పని మేం చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కెసిఆర్,కేటీఆర్, హరీష్ జనజీవన స్రవంతిలోకి రావాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. బీఆర్ఎస్ రీ సర్వే కోరడంపై స్పందించిన మంత్రి రీ సర్వే కోరడం అంటే బీసీల లెక్కలు తేల్చకుండా మరో 50 ఏళ్లు పక్కకు పడేసే కుట్రేనని అన్నారు.

## ఒక్కరోజే రూ.1230 కోట్ల రైతు భరోసా

మూడెకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమ

ఇప్పటివరకు 44 లక్షల మంది ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు

ఎకరాకు రూ.6వేల చొప్పన సాయం

తొలి ప్రాధాన్యం రైతులకే ఇవ్వాలన్న సీఎం రేవంత్



**హైదరాబాద్, మహా:** రైతుభరోసా కుదుటపడుతోంది. ప్రభుత్వం క్రమపద్ధతిలో అమలు చేస్తూ రైతులకు భరోసానిస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయ సాగు యోగ్యమైన మూడు ఎకరాల వరకు ఉన్న భూములకు రైతు భరోసా నిధులు బుధవారం జమ చేశారు. బుధవారం ఒక్క రోజే రూ.1230కోట్లను రైతు ఖతాలో జమ చేసినట్లుగా వ్యవసాయ శాఖ ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకు 44,82,265 మంది రైతులకు 58,13,036 ఎకరాల భూమికి రైతు భరోసాను రూ.3487 కోట్లను అందించినట్లుగా వ్యవసాయ శాఖ తెలిపింది. వ్యవసాయ యోగ్యమైన భూములకు జనవరి 27 నుంచి రైతు భరోసా నిధుల జమ మొదలు కావడం మొదలైంది. ఇప్పటి వరకు విడతల వారిగా నిధులను జమ చేశారు. యాసంగి పంటకు రైతులకు సాయం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎకరానికి రెండు పంటలకు రూ.12వేలు ఇస్తుంది. దీని లో భాగంగా యాసంగిలో ఎకరానికి రూ.6వేలు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకే సగానికి పైగా రైతులకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. త్వరలోనే మిగిలిన రైతులకు నిధులను వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఖజానాలో ఉన్న నిధుల్లో తొలి ప్రాధాన్యం రైతులకే ఇవ్వాలని, రైతుల ఖాతాల్లో నిధుల జమ తర్వాతే ఇతర పనులు చేపడదామని సీఎం అధికారయంత్రాంగాన్ని కోరారు.



## 93 లక్షల గృహాలకు డిజిటల్ కనెక్టివిటీ

మంత్రి శ్రీధర్ బాబు

వివరాలు 2లో

## కులగణన, రిజర్వేషన్లపై

టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మరో కార్యక్రమం

పార్టీనేతలకోసం గాంధీభవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం, ఇన్ ఛార్జి మున్షీ, మంత్రులు

ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలు, డీసీసీ అధ్యక్షులకు ఆహ్వానం



**హైదరాబాద్, మహా:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల గణన, సర్వేతోపాటు.. ఎస్సీ రిజర్వేషన్లపై పార్టీ నేతలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14న గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. గాంధీభవన్ ఆవరణలోని ప్రకాశం హాలులో మధ్యాహ్నం 2 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేయగా.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జి ప్రధాన కార్యదర్శి

మిగతా 2లో

## సచివాలయంలో నిర్మాణ లోపాలు

- ఆరో అంతస్తులో కూలిన డోమ్ కింద గోడ
- రామగుండం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కారు ధ్వంసం
- సచివాలయం వెళ్తున్నారా.. ఐతే హెల్మెట్ ధరించి వెళ్ళండి అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు



వివరాలు 2లో

మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్ పై

## వచ్చే వారం నిర్ణయం

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హైకోర్టులో విచారణ



వివరాలు 3లో

## పీసీసీ మినీ కేబినెట్ రెడీ

- 20 మంది ఉపాధ్యక్షులు.. 20 మంది ప్రధాన కార్యదర్శులు
- పార్లమెంట్ కు ఒక్కరికే ఛాన్స్
- తుది కూర్పుపై సీఎం రేవంత్ తో ఇన్ ఛార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ చీఫ్ మహేష్ చర్చలు
- నేడో, రేపో జాబితా ప్రకటించే అవకాశం
- తొలివిడతలో స్టేట్ కమిటీ.. రెండోవిడతలో డిసిసిలు

03

# లోకల్ ఫైట్.. ఇక లేనట్లే

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక ఎన్నికలు వస్తాయని హడావుడి చేస్తున్న నేతలకు ఇది షాక్ గా మారనుంది. ముఖ్యమంత్రి రేవవత్ రెడ్డి కీలక మంత్రులు ఉత్తమ్, సీతక్క, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ బుధవారం సుదీర్ఘంగా చర్చించి రిజర్వేషన్ల అంశంపై వ్యూహాత్మక నిర్ణయం తీసుకుని బంతిని విపక్షాల కోర్టులోకి నెట్టారు.



## మరోసారి కులగణన

రాష్ట్రంలో మరోమారు కుల గణన జరుగనున్నది. ఈ నెల 1628 మధ్య కుల గణన నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం, మల్లు భట్టి విక్రమార్క బుధవారం మీడియాకు చెప్పారు. కుల గణన సర్వేలో పాల్గొనని 3.1 శాతం వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అటుపై అసెంబ్లీ ఆమోదంతో శాసనం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మార్చి మొదటి వారంలో క్యాబినెట్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం బిల్లును ఆమోదిస్తామన్నారు. అటుపై బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై బిల్లును ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం అని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్ లో ఆమోదించేలా కృషి చేస్తాం అని చెప్పారు. ఓబీసీల రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నేతలను కలుస్తాం అని పేర్కొన్నారు. దీంతో స్థానిక సంస్థలు మరోమారు ఆలస్యం కానున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని భట్టి స్పష్టం చేశారు.

## షాకిచ్చిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ విపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చింది. 42శాతం రిజర్వేషన్ అమలుసాధ్యం కాదని తెలిసీ.. ఒత్తిడి కోసం ఎజెండా ప్రకటించిన బిఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈ నిర్ణయం ఊహించని పరిణామమే. గతంలో తమ ప్రభుత్వం ఇచ్చిన 23శాతం అమలు కూడా డౌటే అంటూ ప్రచారాన్ని మొదలుపెట్టిన బీఆర్ఎస్ కు సర్కారు వ్యూహాత్మక నిర్ణయంతో ఒక్కసారిగా ఖంగుతింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలోనూ సంక్షేమాన్ని మరింత సర్దిన తర్వాత ఎన్నికలకు వెళ్ళాలని, ఇప్పటికిపుడు తొందరపాటే అవుతుందని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయి నుండి కూడా క్యాడర్ సన్నద్ధంగా ఉన్న ఫీడ్ బ్యాక్ రాలేదు. ఇపుడే సంక్షేమ పథకాలు అమలు అవుతున్నందున ఇవి చేరిన తర్వాతే ఓట్ల డిగితే మేలు జరుగుతుందని క్యాడర్ సూచించారు. మరోవైపు స్థానిక ఎన్నికలు ఆలస్యమైనా సర్కారుకు జరిగే నష్టమేమీలేదని, స్థానికంగా మరింత పట్టు పెరుగుతుందని అంచనాకొచ్చింది. వ్యూహం మార్చి రాజకీయ పట్టు బిగించాలని డిసైడైంది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, కొత్త ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాల్లోనూ రెండేళ్ళు, మూడేళ్ళు వాయిదా వేసిన సందర్భాలు గతంలో ఉన్నాయి. కోర్టులు జోక్యం చేసుకుని ఆదేశిస్తే పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోవొచ్చని, ఈలోగా అన్నీ సిద్ధం చేసి పెట్టుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## కేంద్రంపై ఒత్తిడి

42శాతం రిజర్వేషన్ల అంశాన్నికేంద్రానికి వదిలి పెట్టి కేంద్రమంత్రులను, కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవడం ద్వారా బిజెపిపై వ్యూహాత్మక ఒత్తిడి తీసుకు రావాలని, టార్గెట్ చేయాలని కాంగ్రెస్ వ్యూహంగా ఉంది. కాంగ్రెస్ నిర్ణయంతో గత కొంతకాలంగా ఈ అంశంపై రభస చేస్తున్న నాయకులు శాంతించనుండగా, కులగణన అంశంలో సర్వేకు 28వ తేదీ వరకు డెడ్ లైన్ విధించడంతో ఆ లోగా ఎమ్మెల్సీ ఎన్నిక కూడా ముగియనుంది. దీంతో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలో బీసీ అంశం పక్కకు వెళితే కాంగ్రెస్ కు ఊరట లభిస్తుందని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

## రీ సర్వే చేయాలంటున్న బీఆర్ఎస్

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో రాష్ట్రంలో బీసీల శాతం స్వల్పంగా తగ్గినట్లు నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 2014లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో 51 శాతానికి పైగా బీసీలు ఉన్నారని ఆ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం జరిపిన సర్వేలో బీసీల శాతం దాదాపు 5 శాతానికిపైగా తగ్గడంపై ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కులగణన సర్వే మళ్లీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు కుల గణన సర్వే మళ్లీ నిర్వహించాలంటూ కేటీఆర్ డిమాండ్‌పై రేవంత్ కేబినెట్‌లోని పలువురు మంత్రులు మండిపడ్డారు. ఆ క్రమంలో కొండ సురేఖ సైతం కేటీఆర్‌కు కాస్తా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. కుల గణన సర్వే మళ్లీ నిర్వహించాలంటే.. మీతోపాటు మీ ఫ్యామిలీ దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కొండా సురేఖ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దేశంలో కుల గణన జరగాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే.. తెలంగాణలో కుల గణన సర్వే నిర్వహిస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. దీంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు ఆ పార్టీకి పట్టం కట్టాడు. దాంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ కుల గణన సర్వే నిర్వహించింది. ఈ సర్వేపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఈ నేపథ్యంలో మరోసారి కుల గణన సర్వే నిర్వహించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది.

# అన్నీ ఫ్రీగా ఇస్తే ప్రజలు పని చేసేందుకు ఇష్టపడటం లేదు

## ఉచిత పథకాలు మంచిది కాదు: సుప్రీంకోర్టు



**మహా :** ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి మంచిది కాదని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉచితంగా రేషన్, డబ్బు ఇస్తుంటే పని చేసేందుకు ఇష్టపడటం లేదని అభిప్రాయపడింది. ఉచితాల కారణంగా ప్రజలు పనికి మొగ్గు చూపట్లేదని పేర్కొంది. ప్రజలను పరాన్నజీవులుగా మారుస్తున్నారని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. పట్టణాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు బుధవారం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. "దురదృష్టవశాత్తు ఈ ఉచితాల కారణంగా ప్రజలు పని చేయడానికి ఇష్టపడటం లేదు. వారికి ఉచిత రేషన్లు లభిస్తున్నాయి. వారు ఎటువంటి పని చేయకుండానే ఆ మొత్తాన్ని పొందుతున్నారు. ప్రజలపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు మేము అభినందిస్తున్నాము. కానీ వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయడం మంచిది కాదా?" అని ప్రశ్నించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే పనిలో ఉందని, నిరాశ్రయులకు ఆశ్రయం సహా పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి ఈ సందర్భంగా ధర్మాసనానికి తెలిపారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై విచారణను మరో ఆరు వారాలు వాయిదా వేసింది.




# కేంద్రమంత్రి షెకావత్‌కు తెలంగాణ బీజేపీ ఎంపీల రిక్వెస్ట్

- సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్రం అధికారికంగా నిర్వహించాలి
- కేంద్రమంత్రి ని కలిసిన ఎంపీలు డి.కె. అరుణ, రఘునందన్ రావు, విశ్వేశ్వర్ రెడ్డి
- దేశంలో 12 కోట్ల బంజారాలు ఉన్నారన్న బీజేపీ ఎంపీలు

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా 12 కోట్ల బంజారాలు ఉన్నారని, బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఎంపీలు డి.కె. అరుణ, రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, సంత్ సేవాలాల్ జయంతిని దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలన్నారు. అవసరమైతే ఈ అంశాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకువెళతామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అధికారికంగా జయంతిని నిర్వహించాలని కోరారు. ఈ నెల 15న సంత్ సేవాలాల్ జయంతి ఉందని, ఈ లోపు వీలుకాకపోతే వచ్చే ఏడాదికైనా అధికారికంగా నిర్వహించేలా చూడాలని కోరారు.

# అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ కన్నుమూత

## ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి సంతాపం





**మహా:** అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి మహంత్ సత్యేంద్ర దాస్ (85) ఏళ్ల వయస్సులో బుధవారం లక్నోలోని ఓ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఈ నెల మొదట్లో బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ఆయన పరిస్థితి విషమించడంతో సత్యేంద్రని లక్నోలోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చేర్చారు. ఈ క్రమంలోనే ఆయన ఆరోగ్యం మరింత క్షీణించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే హై డిపెండెన్సీ యూనిట్‌లో చికిత్స పొందుతున్న ఆయన తాజాగా తుది శ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విచారం వ్యక్తం చేశారు.

**20 ఏళ్లకే పూజారిగా..**

మహంత్ సత్యేంద్ర దాస్ 20 ఏళ్ల వయస్సులోనే అయోధ్య రామాలయ ప్రధాన పూజారిగా నియమితులయ్యారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో తాత్కాలికంగా రామాలయ పూజారిగా కూడా సేవలు అందించారు. ఆయన జీవితం ఎప్పటికీ రామ జన్మభూమి, రామ ఆలయంతోనే సంబంధం కల్గి ఉంది. ఈ క్రమంలో రామాలయంలో ప్రధాన పూజారిగా బాధ్యతలు నిర్వహించడంతోపాటు అనేక పనులను నిర్వహించారు. బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సమయంలో కూడా సత్యేంద్ర దాస్ కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత రామాలయం ప్రధాన పూజారిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన మరణం పట్ల అనేక మంది ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

**రామాలయం కోసం**

రామాలయంలో అనేక సంవత్సరాల పాటు పూజారిగా వ్యవహరించిన మహంత్ సత్యేంద్ర దాస్, అయోధ్య రామాలయ పరిణామాలపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలతో పర్యవేక్షణ, సంప్రదింపుల నిర్వహణలో ప్రముఖ వ్యక్తిగా నిలిచారు. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో కూడా ఆయన ప్రధాన పూజారిగా పనిచేయడంతోపాటు రామ్ లల్లా విగ్రహ స్థాపనలో కీలక పాత్ర పోషించారు. ఆచార్య సత్యేంద్ర దాస్ అయోధ్య వివాదాన్ని అన్వేషించే 2024 డాక్యుమెంటరీ సిరీస్ "ది బాటిల్ ఆఫ్ అయోధ్య"లో ప్రదర్శించారు. ఈ క్రమంలో అయోధ్యలో అనేక సంవత్సరాలు మహంత్ సత్యేంద్ర దాస్ రామాలయం కోసం పాటుపడ్డారు.



# సచివాలయంలో ఫేక్ ఐఏఎస్ అధికారి

- ఐఏఎస్ నంటూ నిరుద్యోగులకు టోకరా
- ఫేక్ ఐఏఎస్ అధికారి బాలకృష్ణ అలియాస్ బాలుగా గుర్తింపు

**మహా :** రాష్ట్ర సచివాలయంలో నకిలీ ఉద్యోగుల వ్యవహారం రోజుకొకటి వెలుగులోకి వస్తోంది. ఐఏఎస్ అధికారినని, సచివాలయంలో పని చేస్తున్నానని నమ్మించిన ఒక వ్యక్తం నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరి నుంచి రూ. 20 వేలు తీసుకొని నకిలీ అపాయింట్ మెంట్ లెటర్లు ఇచ్చాడు. ఉద్యోగం దొరికిందన్న సంతోషంతో నకిలీ ఎఎస్ అధికారి ఇచ్చిన అపాయింట్ మెంట్ లెటర్లను పట్టుకుని సచివాలయానికి వచ్చారు. తమకు అపాయింట్ మెంట్ లెటర్లు అందించిన అధికారి కోసం వెతుకుతున్న ఇద్దరిని గమనించిన సిబ్బంది అనుమానాస్పదంతో ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారు. సచివాలయంకు చేరుకున్న పోలీసులు అపాయింట్ మెంట్ ఆర్డర్ తో వచ్చిన యువకులను ప్రశ్నించగా వారిద్దరూ రాఘవేంద్ర, రాజ్ కుమార్ లని తేలడంతో పాటు నాగర్ కర్నూల్ జిల్లా అని పోలీసులు గుర్తించారు. జరిగిన విషయాన్నిగ్రహించిన పోలీసులు నకిలీ అపాయింట్ మెంట్లు అందుకున్న ఇద్దరి నుంచి పిర్యాదును స్వీకరించారు. అంతేకాకుండా జరిగిన మోసంపై సొంత జిల్లా నాగర్ కర్నూల్ లో ఫిర్యాదు చేయాల్సిందిగా కూడా సూచించారు. వరుసగా సెక్రటేరియట్ లో ఫేక్ ఉద్యోగులు బయటపడుతుండటం కలకలం రేకెత్తిస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఫేక్ ఐఎఎస్ అధికారి కోసం సచివాలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీఎఫ్ అధికారులతో పాటు పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఇచ్చిన హామీలేవీ అమలు కావడం లేదు

- అందుకే రాహుల్ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నారు
- వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు కాలేదు
- కాంగ్రెస్ నేతలను ప్రజలు విశ్వసించడం లేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



**మహా :** ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే రాహుల్ గాంధీ తన వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆయనకు వరంగల్ వచ్చే ధైర్యం లేకుండా పోయిందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాతూ, వరంగల్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ అమలు కాలేదన్నారు. ఇచ్చిన మాటను తప్పితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు విశ్వసించడం లేదని, అందుకే ఢిల్లీ నుండి నాయకులను తీసుకువచ్చి ప్రచారం చేయించారని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వచ్చి చిలుకపలుకులు పలికారన్నారు. తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి ముఖం చూసి ఓట్లు వేయలేదని, ఢిల్లీ నేతల ముఖం చూసి ఓట్లు వేశారన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో నేరాలు 20 శాతం పెరిగాయన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఎక్కడో ఒక చోట మతకల్లోలాలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు భద్రత కోసం కూడా పోరాటం చేయాల్సి రావడం బాధాకరమన్నారు. కేసీఆర్ మీద అక్కసుతో కేసీఆర్ కిట్‌లను నిలిపివేశారని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం అంటూ బస్సుల సంఖ్య తగ్గించారని విమర్శించారు.

# 93 లక్షల గృహాలకు డిజిటల్ కనెక్టివిటీ

## మంత్రి శ్రీధర్ బాబు



రాష్ట్రంలోని 93 లక్షల గృహాలను డిజిటల్ కనెక్టివిటీ పరిధిలోకి తీసుకురానున్నట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. టీ ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రారంభించినట్టు బుధవారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందానికి వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద డిజిటలైజేషన్ చేపట్టిన నాలుగు గ్రామాలను ఈ బృందం సందర్శించి తమ అనుభవాలను మంత్రితో పంచుకుంది. హాజిపల్లి (రంగారెడ్డి జిల్లా), మద్దూర్ (నారాయణ్ పేట), సంగుపేట (సంగారెడ్డి), అడవి శ్రీరాంపూర్ (పెద్దపల్లి) గ్రామాల్లో ఇంటర్నెట్ కనిక్టివిటీ వల్ల స్థానికులకు కలిగిన ప్రయోజనాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్టు వైజంతీ దేశాయ్, కింబర్లీ జాన్స్ ఆధ్వర్యంలోని ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందం వెల్లడించింది. మరో మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు కనెక్టివిటీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు శ్రీధర్ బాబు వారికి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 32 వేల కిమీ పొడవున ఫైబర్ ఆప్టిక్ కేబుల్ ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. సమావేశంలో ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ఇషిరా మెహతా, అరుణ్ శర్మ, స్యూ సంజ్ ఎంగ్ లు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో చేరిన ప్రణబ్ ముఖర్జీ తనయుడు

**మహా:** దివంగత ప్రణబ్ ముఖర్జీ తనయుడు, లోక్ సభ మాజీ ఎంపీ అభిజిత్ ముఖర్జీ మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన నాలుగేళ్ల క్రితం తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈరోజు పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా అభిజిత్ ముఖర్జీ మాట్లాడుతూ, కాంగ్రెస్ వ్యక్తి ఎప్పటికైనా కాంగ్రెస్ పార్టీలోకే తిరిగి వస్తాడని ఆయన అన్నారు. అది సహజమే అన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడటం పొరపాటు అని, అందుకు చింతిస్తున్నానని అన్నారు. అభిజిత్ ముఖర్జీ రాజకీయాల్లోకి రాకముందు ప్రముఖ కార్పొరేట్ సంస్థల్లో పని చేశారు. ప్రణబ్ ముఖర్జీ 2012లో రాష్ట్రపతి అయ్యాక బెంగాల్‌లోని జాంగీపూర్ నుండి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014లో లోక్ సభ ఎన్నికల్లోనూ అదే స్థానం నుంచి విజయం సాధించారు. 2019లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ గెలుపొందిన తర్వాత అభిజిత్ ముఖర్జీ ఆ పార్టీలో చేరారు.

# ఆలయాల సందర్శన పూర్తిగా వ్యక్తిగతం

## భక్తుల మనోభావాలు కాపాడాలన్నదే నా ఆవేదన

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో దోషులను అరెస్ట్ చేయడం సంతోషం

కేరళలోని శ్రీ అగస్త్య మహర్షి ఆలయ సందర్శన అనంతరం

మీడియాతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**మహా :** 'తిరుమల బాలాజీకి దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్నారు. తిరుమలకు వచ్చే భక్తులు ఎంతో నమ్మకంగా, ఆధ్యాత్మిక చింతనతో వస్తుంటారు. అలా వచ్చే వారి మనోభావాలు గాయపడకూడదు అన్నదే నా ఆవేదన. తిరుమల లడ్డులో కల్తీ జరగడం నిజంగా దురదృష్టకరం. ఇలాంటి ఘటనలు మళ్లీ భవిష్యత్తులో జరగకూడదు అన్నదే నా బలమైన ఆకాంక్ష' అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. దక్షిణ భారతదేశ ఆలయాల యాత్రకు శ్రీకారం చుట్టిన శ్రీ పవన్ కళ్యాణ్ బుధవారం కేరళలోని చొట్టనిక్కరలో ఉన్న శ్రీ ఆగస్త్య మహర్షి ఆలయం, అగస్త్య ఆశ్రమం సందర్శన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు కల్తీ వ్యవహారంపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వారిని అరెస్టు చేయడం కేసు దర్యాప్తులో భాగం, సంతోషించదగిన విషయమన్నారు. భవిష్యత్తులో కూడా తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదాల్లో కానీ, ఇతర వ్యవహారాల్లో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

## ఇది నా వ్యక్తిగత పర్యటన

దక్షిణాది రాష్ట్రాల ఆలయాల సందర్శన అనేది పూర్తిగా నా వ్యక్తిగత అంశం. రాజకీయాలకు సంబంధం లేదు. సుమారు నాలుగున్నర సంవత్సరాల క్రితం చెల్లించుకోవలసిన మొక్కుల నిమిత్తం, నా ఆరోగ్యం సైతం అంతగా సహకరించకున్నా రావాల్సి వచ్చిందన్నారు. కేరళతో పాటు తమిళనాడులో ఉన్న ఆలయాలను దర్శించుకుంటున్నాను, ఎర్ర చందనాన్ని అక్రమ రవాణా చేస్తున్నప్పుడు పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. ఎర్రచందనం అమ్మకం విషయంలో దేశం మొత్తానికి నూతన విధానం తీసుకురావాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు.

# త్వరలో హరీశ్‌రావు పాదయాత్ర

**సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయాలంటూ డిమాండ్**



**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు త్వరలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలుస్తోంది. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేయాలనే డిమాండ్ చేస్తూ సంగమేశ్వర ఆలయం వద్ద పాదయాత్రను ప్రారంభించనున్నారు. ఆ ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో వారం రోజులపాటు.. 130 కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. గ్రామాల్లో రోజుకో సభ నిర్వహించనున్నారని.. చివరి రోజు కేసీఆర్ హాజరు కానున్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా వైఫల్యం చెందిందంటూ ఆరోపణలు చేస్తున్న విషయం విదితమే. అవకాశం దొరికిన ప్రతి వేదికను వినియోగించుకుంటున్న ఆయన సమస్యలపై గొంతెత్తుతున్నారు. ఈ క్రమంలోనే రోజూ సోషల్ మీడియా వేదికగా రైతులు, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వస్తున్న విషయం తెలిసిందే.

**కేసీఆర్ పిలుపు మేరకు..**


ఇదిలా ఉంటే కొద్ది రోజుల క్రితం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో సమావేశం ఏర్పాటు చేసి, రైతుల పక్షాన హరీశ్‌రావు అధ్యక్షతన ఉద్యమం చేయాలని.. దీనికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే.. త్వరలో సంగమేశ్వర ఆలయం నుంచి హరీశ్‌రావు పాదయాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేయాలని హరీష్ రావు నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే బీఆర్ఎస్ శ్రేణులతో చర్చించిన హరీశ్‌రావు.. ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో వారం రోజుల పాటు.. దాదాపు పాదయాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పాదయాత్రలో భాగంగా గ్రామాల్లో రోజుకో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే ఈ పాదయాత్ర ముగింపు రోజు నిర్వహించే భారీ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరు కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పాదయాత్ర పై బీఆర్ఎస్ పార్టీ అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.

# పీసీసీ మినీ కేబినెట్ రెడీ

- 20 మంది ఉపాధ్యక్షులు.. 20 మంది ప్రధాన కార్యదర్శులు
- పార్లమెంట్ కు ఒక్కరికే ఛాన్స్
- తుది కూర్పుపై సీఎం రేవంత్ తో ఇన్ ఛార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ చీఫ్ మహేష్ చర్చలు
- నేడో, రేపో జాబితా ప్రకటించే అవకాశం.. తొలివిడతలో స్టేట్ కమిటీ.. రెండోవిడతలో డిసిసిలు

**హైదరాబాద్, మహా:** టీపీసీసీ మినీ కేబినెట్ రెడీ అయింది. ఈసారి ఎంతో జాగ్రత్తగా ఆచితూచి పార్టీ విస్తరణ, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని వ్యూహాత్మకంగా కమిటీని ఎంపికచేస్తున్నట్లు సమాచారం. గతంలో లాగా జంబో కమిటీ కాకుండా ఈసారి మినీ కేబినెట్ రూపొందిస్తున్నట్లు సమాచారం. పీసీసీ కమిటీని కూడా రెండు విడతలుగా వేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, 17పార్లమెంట్ నియోజకవర్గాల నుండి 17మంది, రాష్ట్ర పార్టీ కార్యాలయ నిర్వహణలో ఉండే మరో ముగ్గురు సీనియర్లను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రధాన కార్యదర్శులను కూడా ఇదే తరహాలో ఎంపిక చేస్తున్నట్లు సమాచారం ముందుగా వచ్చే ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వాణిని బలంగా వినిపించేందుకు నూతన కమిటీల నియామకం దోహదపడుతుందని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. బుధవారం కమిటీ కూర్పుపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చర్చించి, తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయినట్లు సమాచారం. ముగ్గురు నేతల భేటీలో కమిటీకి తుదిరూపు వచ్చినట్లు తెలుస్తోంది. ఇతర పదవులకు సంబంధించి మరో విడతలో జాబితా వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. డిసిసిలపై ఇప్పటికే కసరత్తు పూర్తయినా ఎఐసిసి జాతీయ స్థాయిలో అన్ని డిసిసిలను ఒకేసారి ప్రకటించే యోచనలో ఉంది. దీంతో స్టేట్ కమిటీ ప్రకటన తర్వాతే డిసిసిల ప్రకటన వచ్చే అవకాశాలున్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.





## మాజీ మంత్రి హరిష్ రావు అరెస్ట్ పై వచ్చేవారం నిర్ణయం

**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హైకోర్టులో విచారణ**

**హైదరాబాద్, మహా:** పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ డీసీపీ రాధాకిషన్ రావులను వచ్చే బుధవారం వరకు అరెస్ట్ చెయ్యవద్దని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. తన పై నమోదైన కేసును కొట్టివేయాలంటు హరీష్ రావు , రాధాకిషన్ రావు హై కోర్టులో వేర్వేరుగా దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ల పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఫోన్ ట్యాపింగ్ పాల్పడ్డరని కాంగ్రెస్ నేత, రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుతో పాటు రాధాకిషన్ రావు పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పిటిషన్ పై విచారణను వచ్చే బుధవారానికి వాయిదా హైకోర్టు వాయిదా వేసింది.

## ఆర్మీపై అనుచిత వ్యాఖ్యలు.. రాహుల్ గాంధీకి లక్నో కోర్టు సమన్లు

**భారత్ జోడో యాత్ర సందర్భంగా ఆర్మీపై రాహుల్ వ్యాఖ్యలు**

సైన్యాన్ని రాహుల్ అవమానించారంటూ బీఆర్‌వో మాజీ డైరెక్టర్ ఫిర్యాదు

మార్చి 24న తమ ఎదుట హాజరు కావాలని కోర్టు ఆదేశం



**మహా:** భారత ఆర్మీని అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదైన కేసులో లక్నో లోని ప్రత్యేక ఎంపీఎమ్మెల్యే కోర్టు సమన్లు జారీచేసింది. మార్చి 24న తమ ముందు హాజరు కావాలని రాహుల్‌ను ఆదేశించింది. 'భారత్ జోడో యాత్ర సందర్భంగా డిసెంబర్ 2022లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ భారత ఆర్మీని అవమానించేలా వ్యాఖ్యలు చేశారని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ ఫిర్యాదు చేశారు.

రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలతో భారత ఆర్మీని అవమానించారని శ్రీవాస్తవ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జాతీయ సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆర్మీపై రాహుల్ వ్యాఖ్యలు తగవని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (ఏసీజేఎం) కోర్టు రాహుల్‌కు తాజాగా సమన్లు జారీ చేసింది. 2022 డిసెంబర్ 9న రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ.. చైనా గురించి మీడియా తనను ఏమీ అడగదని తన స్నేహితుడితో పందెం కట్టానని పేర్కొన్నారు. 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూమిని ఆక్రమించిన దేశం గురించి, మన సైనికులను చంపిన దేశం గురించి, అరుణాచల్ ప్రదేశ్‌లో మన సైనికులపై దాడి చేస్తున్న దేశం గురించి 'ప్రెస్' తననేమీ అడగదని పేర్కొన్నారు. తాను చెప్పింది నిజమేనని, దేశం గమనిస్తోందని, వేరేలా ఆలోచించవద్దని రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సైన్యం కూడా తీవ్రంగా స్పందించింది. 2022 డిసెంబర్ 12న రాహుల్ వ్యాఖ్యలపై ఆర్మీ స్పష్టత నిచ్చింది. చైనా ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లోకి అక్రమంగా ప్రవేశించిందని, ఇండియన్ ఆర్మీ దానిని బలంగా తిప్పకొట్టిందని పేర్కొంది.

## కులగణన, రిజర్వేషన్లపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మరో కార్యక్రమం

(మొదటిపేజీ తరువాయి)

దీపదాస్ మున్షీ హాజరుకానున్నారు. కాగా, కులగణనపై మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కో చైర్మన్ మంత్రి దామోదర రాజ నర్సింహ, సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొని ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గ బాద్యులు, పోటీ చేసిన అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే లు, కార్యవర్గ ప్రతినిధులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కోరారు.

**సచివాలయంలో నిర్మాణ లోపాలు**

# ఆరో అంతస్తులో కూలిన డోమ్ కింద గోడ

**రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ కారు ధ్వంసం**

సచివాలయం వెళ్తున్నారా.. ఐతే హెల్మెట్ ధరించి వెళ్ళండి

అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ పరిపాలనా కేంద్రం సచివాలయంలో ప్రమాదం తప్పింది. సచివాలయం ఆరో అంతస్తు నుంచి ఒక్కసారిగా పెచ్చులు ఊడిపడ్డాయి. పెద్ద శబ్దాలతో పెచ్చు ఊడిపడడంతో ఉద్యోగులందరూ ఉలిక్కిపడ్డారు . ఆరో అంతస్తులోని డోమ్ కింద ఉన్న బీమ్ నుంచి పెచ్చులు ఊడి కింద పడ్డాయి. పెచ్చులూడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం త ప్పింది. అయితే సచివాలయంలో పని నిమిత్తం వచ్చిన రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ తన కారును సచివాలయం కింద పెట్టి వచ్చాడు. దీంతో పెచ్చులూడిన ప్రాంతంలోనే ఆ కారు ఉండటంతో వాహనం ధ్వంసం అయింది.సచివాలయంలో అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. అనంతరం కులగణనపై మీడియా సమావేశం కూడా నిర్వహించారు. ఆ సమయంలో అధికారులంతా సమావేశంలో ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. సమీక్ష నిర్వహించిన అనంతరం పెచ్చులూడిన విషయం భట్టి విక్రమార్క దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు.

**అక్కడ కూలేశ్వరం.. ఇక్కడ సచివాలయం.. ఏది కట్టినా ఇంతేనా బాపూ**

కాళేశ్వరం కూలేశ్వరమైంది. ముణ్ణాళ్ళముచ్చటే అయి.. బ్యారేజీలకు పగుళ్ళు వచ్చినయి. యాదాద్రిలోనూ నాణ్యత లోపాలు. ఇపుడు ముచ్చటపడి 1200కోట్లతో కట్టిన సచివాలయంలోనూ నాణ్యతా లోపాలేనా? గోడలు కూలుతున్నయ్. పెచ్చులూడి పడ్డ సమయంలో ఎవరూ లేరు కాబట్టి సరిపోయింది. లేకుంటే ఆ పద్దతీరుకు ఇబ్బందులొచ్చేవి. ఏది కట్టినా ఇంతేనా బాపూ అంటూ సోషల్ మీడియా లో ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ నేతలు కేసీఆర్ నిర్మాణాల నాణ్యతాలోపంపై భగ్గుమన్నారు. సచివాలయం వెళ్తున్నారా.. జరభద్రం డోమ్ లు కూలొచ్చు. గోడల పెచ్చులూడి పడొచ్చు. వీలైతే వెళ్ళకండి. వెళ్తే హెల్మెట్ ధరించి వెళ్ళడం ఉత్తమం అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.



## రాజ్యసభకు కమల్ హాసన్...!

- తమిళనాడు సీఎం నుంచి స్పష్టమైన హామీ
- దేశం కోసమే తమ పార్టీ కూటమికి మద్దతు ప్రకటించిందని, అప్పట్లో చెప్పిన కమల్ హాసన్

**మహా:** తమిళ సూపర్ స్టార్, నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్ ను రాజ్యసభకు నామినేట్ చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రం నుంచి డీఎంకే పార్టీ కమల్ ను పెద్దల సభకు నామినేట్ చేస్తుందని సమాచారం. జూలైలో రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రచారం తెరపైకి రావడానికి కారణం లేకపోలేదు. తమిళనాడు మంత్రి పీకే శేఖర్ బాబు బుధవారం కమల్ ఇంటికి వెళ్లారు. కమల్ ను కలిశారు. ఆయనతో మాట్లాడారు. మీకు రాజ్యసభ సీటు కన్ ఫర్మ్ చేసినట్లు చెప్పారట. కమల్ హాసన్ కు చెందిన మక్కల్ నీది మయం పార్టీ గత ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి మద్దతుగా ప్రచారం చేసింది. పొత్తులో భాగంగా మక్కల్ నీది మయ్యమ్ పార్టీకి 2025 ఏడాదికి ఒక రాజ్యసభ సీటు ఇస్తామని అప్పట్లో వాగ్దానం ఇచ్చారట. ఈ డీల్ లో భాగంగా, లోక్ సభ ఎన్నికల్లో మద్దతు ఇచ్చినందుకు, మిత్ర ధర్మం పాటిస్తూ.. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. కమల్ హాసన్ కు రాజ్యసభ సీటు ఇస్తామని హామీ ఇచ్చారట. కాగా, దేశం కోసమే తమ పార్టీ కూటమికి మద్దతు ప్రకటించిందని, తాను ఏ పోస్టు ఆశించలేదని అప్పట్లో కమల్ హాసన్ చెప్పారు. జూన్ లో 6 రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రామిస్ ను కమల్ హాసన్ కు చేరవేశారు మంత్రి శేఖర్ బాబు. మిమ్మల్ని పెద్దల సభకు పంపిస్తామని కమల్ హాసన్ తో ఆయన చెప్పినట్లు సమాచారం.



## కుల గణన రీ సర్వే దుర్మార్గం

**ఆ సర్వేనే తప్పుల తడక**

- తెలంగాణ జనాభాను కుదించారు
- 4.30 కోట్ల జనాభా 3.70కోట్లుగా చూపారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

**మహా:** కుల గణన సర్వే అంతా తప్పుల తడక అని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో 3.1 శాతం మంది పాల్గొనలేదని, వారి కోసం మళ్లీ రీ సర్వే చేస్తామని ప్రకటించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల గణన సర్వే అంతా తప్పుల తడక అని ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం తెలంగాణలో 3 కోట్ల 35 లక్షలకుపైగా ఓటర్లున్నారు. అట్లాగే ఓటు హక్కు లేని వారు ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల సంఖ్య 60 లక్షలుగా నమోదైంది. వీరుగాక పాఠశాలకు వెళ్లని వారు, 0 నుండి 5 ఏళ్ల లోపు పిల్లలు మరో 30 లక్షలకుపైగా ఉందన్నారు. ఈ లెక్కన తెలంగాణ జనాభా 4 కోట్ల 30 లక్షలు దాటుతుంది. తెలంగాణలో ఆధార్ కార్డులున్న వారి సంఖ్య 3 కోట్ల 95 లక్షలు. కానీ కుల గణన సర్వేలో తెలంగాణ జనాభా 3 కోట్ల 70 లక్షలుగా కుదించడం పెద్ద బూటకమని విరుచుకపడ్డారు. బీసీ సామాజికవర్గంలోని వివిధ కులాలకు చెందిన జనాభాను కుల గణన పేరుతో ఉద్దేశపూర్వకంగానే తగ్గించే కుట్ర చేసినట్లు స్పష్టంగా కన్పిస్తోంది.

## బెంగళూరు, చెన్నైలకు 2 గంటలే జర్నీ

- తెలంగాణకు బుల్లెట్ రైళ్ళు
- హై స్పీడ్ రైలు కారిడార్లతో త్వరలో అనుసంధానం

**మహా:** హైదరాబాద్ నుండి బెంగళూరుకు రైలు ప్రయాణం తగ్గనుంది.. ఇకపై ఫ్లైట్ జర్నీ చేసినంత సమయంలో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ట్రైన్ లో వెళ్ళచ్చు. ఇటీవల కేంద్రం ప్రకటించిన హై స్పీడ్ రైలు కారిడార్లతో హైదరాబాద్ నుంచి బెంగళూరు చెన్నై నగరాలకు రైలులో రెండు గంటల్లో.. అంటే ఫ్లైట్ జర్నీతో సమానంగా వెళ్లే అవకాశం ఉంది. హై స్పీడ్ కారిడార్ల రాకతో హైదరాబాద్ నుండి బెంగళూరు చెన్నై నగరాలకు 10 గంటల పాటు ప్రయాణ సమయం తగ్గనుంది. ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్పోర్టు నుండి బెంగళూరు కెంపెగౌడ ఎయిర్పోర్టుకి విమాన సమయం 1 గంట 15 నిమిషాలు. హైదరాబాద్ నుండి చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి 1 గంట 15 నిమిషాలుగా ఉంది.. ఫ్లైట్ జర్నీ కాకుండా.. సిటీ సెంటర్స్ ను చేరుకోవడానికి మరో 2 3 గంటల సమయం పడుతుంది. హైదరాబాద్ నుండి బెంగళూరుకి బుల్లెట్ ట్రైన్లో కేవలం 2 గంటల్లోనే వెళ్లే అవకాశం ఉంది. అదే చెన్నైకి వెళితే.. 2 గంటల 20 నిమిషాలు పెట్టె అవకాశం ఉంది.. ఇది ఫ్లైట్ జర్నీతో సమానం.

# వనపర్తికి ఐటీ టవర్ మంజూరు

**రూ. 22 కోట్లు విడుదల .. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు**

**మహా :** వనపర్తి జిల్లాకు ఐటి టవర్ మంజూరు అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయ మీడియా సెంటర్ లో విలేకరుల సమావేశంలో ఐటి టవర్ మంజూరు అంశాలను చిన్నరెడ్డి వెల్లడించారు. ఐటీ టవర్ నిర్మాణం కోసం రూ 22 కోట్లు విడుదల చేస్తూ ఐ టీ శాఖ జీవో ఎంఎస్ నెంబర్ వన్ తేదీ 1122025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలోని రెండు ఎకరాల స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 25 వేల చదరపు అడుగులలో ఐటీ భవన నిర్మాణం జరుగుతుందని ఈ భవనంలో ఏక కాలంలో 250 మంది ఐటి ప్రొఫెషనల్స్ పనిచేసుకునే సౌకర్యం ఉంటుందని చిన్నారెడ్డి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ఐటి హబ్ లను అభివృద్ధి చేయడంలో భాగంగా వనపర్తికి ఐటి టవర్ మంజూరు అయిందని సామాజిక ఆర్థిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి సౌకర్యం కల్పించేందుకు ఈ ఐటి టవర్ ను వనపర్తి లో ఏర్పాటు చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి కి మంజూరు అయిన ఐటీ టవర్ ను ఏడాదిలో నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఐటీ ప్రొఫెషనల్స్ కు ప్రొఫెషనల్ స్కూల్ ఐటీ టవర్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని వనపర్తి జిల్లాకు ఇది శుభవార్త అని చిన్నారెడ్డి తెలిపే పేర్కొన్నారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ



వల్ల ఐటీ టవర్ మంజూరు అయిందని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు.

# ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆ పార్టీదే పవర్

**.. ఇండియా టుడే సర్వేలో షాకింగ్ ఫలితాలు..!**

**మహా :** దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపై ఇండియా టుడే సీఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే నిర్వహించగా, ఇందులో సంచలన ఫలితాలొచ్చాయి. ఇప్పటికిప్పుడు భారత్‌లో లోక్ సభ ఎన్నికలు జరిగితే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధిస్తోందని సర్వేలో వెల్లడైంది. ఎన్డీఏ కూటమి 343 సీట్లు సాధించే అవకాశం ఉందని సర్వే ఫలితాల ద్వారా స్పష్టమైంది. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాలసిన సాధారణ మెజార్టీ (272 సీట్లు)ని బీజేపీ సునాయసంగా సాధిస్తోందని ఇండియా టుడే సీ ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. ఇక.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 232 సీట్లు సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. 188 స్థానాలకు పడిపోతుందని సర్వేలో తేలింది. తాజా సర్వేలో పార్టీల పరంగా చూస్తే బీజేపీ 281 సీట్లు, కాంగ్రెస్ 78 స్థానాలు దక్కించుకుంటాయని స్పష్టమైంది. 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లు



గెలవగా.. కాంగ్రెస్ 99 స్థానాల్లో విజయం సాధించింది. అదే ఇప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీ 240 సీట్లను కాస్త.. 281 స్థానాలకు పెంచుకుంటుందని.. కాంగ్రెస్ 99 సీట్ల నుంచి 78కి పడిపోతుందని సర్వే ఫలితాల్లో బహిర్గతమైంది. ఇండియా టుడేసివోటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ ఈ పోల్‌ను 2025, జనవరి 2 నుంచి 2025, ఫిబ్రవరి 9 మధ్య నిర్వహించింది. దేశవ్యాప్తంగా అన్ని లోక్‌సభ నియోజకవర్గాలలో 1,25,123 మంది ఓటర్ల అభిప్రాయాలను సేకరించి నివేదిక రూపొందించినట్లు ఇండియా టుడే స్పష్టం చేసింది.

**మారిన బిజెపి**

2024 లోక్ సభ ఎన్నికల్లో ''ఇస్ బార్ చార్ సౌ పార్'' (400 సీట్లు) నినాదంతో బీజేపీ బరిలోకి దిగింది. కానీ బీజేపీకి ఓటర్లు ఊహించని షాకిచ్చారు. కాషాయ పార్టీని కేవలం 240 స్థానాలకే పరిమితం చేశారు. దీంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఎన్డీఏ కూటమిలోని మిత్ర పక్షాల మద్దతు బీజేపీకి అనివార్యమైంది. ఈ క్రమంలోనే ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలైన టీడీపీ, జేడీయూ మద్దతుతో బీజేపీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. లోక్ సభ ఎన్నికల తర్వాత నుంచి బీజేపీ క్రమంగా తమ బలం పెంచుకుంటూ పోయింది. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయాలు సాధించి కేంద్రంలో సీటును మరింత స్ట్రాంగ్ చేసుకుంది. 2024 లోక్ సభ ఎన్నికల్లో కాస్తా పుంజుకున్న కాంగ్రెస్ క్రమంగా డౌన్ ఫాల్ అవుతోందని సర్వేలో తేలింది. ఇందుకు కారణం కాంగ్రెస్ పార్టీ సొంత వైఖరేనని సర్వేలో ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.



# హైదరాబాదీ హ్యూమన్ కాలిక్యులేటర్ భాను ఘనత..

## ఫోర్బ్స్ అండర్ 30 జాబితాలో చోటు

ఎడ్యుటెక్ స్టార్టప్ కంపెనీ భాంజు వ్యవస్థాపకుడు, హ్యూమన్ కాలిక్యులేటర్‌గా పేరుగాంచిన యువకుడు నీలకంఠ భాను మరో ఘనత సాధించారు. తాజాగా ఫోర్బ్స్ విడుదల చేసిన ఫోర్బ్స్ 30 అండర్ 30 2025 జాబితాలో స్థానం సంపాదించుకున్నార. 2022 లో ఆసియా జాబితాలోనూ భాను పేరుంది. విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యేలా చెప్పడమే ఈ భాంజు కంపెనీ ప్రత్యేకత. నీలకంఠ భానుతో పాటుగా భాంజు వ్యవస్థాపకులు దేవులపల్లి లక్ష్మీ ప్రచోతన్, అల్లూరు ఉదయ్ కిరణ్, జొన్నలగడ్డ సాయి కృష్ణకాంత్‌లూ ఫోర్బ్స్ లిస్ట్‌లో చోటు సంపాదించుకున్నారు. గత సంవత్సరం సిరీస్ బి ఫండింగ్‌లో రూ. 140 కోట్ల వరకు ఈ అంకుర సంస్థ భాంజు నిధులు సమీకరించింది. హైదరాబాద్‌కు చెందిన నీలకంఠ భాను ప్రకారం ప్రపంచంలోనే వేగవంతమైన మానవ కాలిక్యులేటర్‌గా గుర్తింపు పొందారు. 2020 లో లండన్ వేదికగా జరిగిన వరల్డ్ మైండ్ స్పోర్ట్స్ ఒలింపియాడ్‌లో మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలిచారు. గణితం అంటే ఒక మానసిక క్రీడగా భాను ఎప్పుడూ చెప్తుంటారు. ఐదేళ్ల వయసు ఉన్నప్పడే గణితంతో తన ప్రయాణం మొదలైందని భాను ప్రకాశ్ పలు సందర్భాల్లో తెలిపారు. 2005 లో ఓ రోడ్డు ప్రమాదంలో అతని మోదడుకు తీవ్ర గాయమైందని, ఐదు రోజుల పాటు స్పృహ కోల్పాయానని చెప్పారు. కోలుకునేందుకు ఏడాది పట్టిందని, దీంతో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చిందని గతంలో చెప్పారు. అప్పడే సమయం గడిపేందుకు గణితం పజిల్స్ పరిష్కరించే ప్రయత్నం మొదలు పెట్టానని అలా తన గణిత ప్రస్థానం మొదలైందని వివరించారు

### నలుగురు కలిస్తేనే సక్సెస్

లోకల్ స్టార్టప్స్ సక్సెస్ రేటు ఇప్పుడు పెరిగింది. కారణం స్టార్టప్ కల్చర్ పెరగడం. ప్రొఫెషనల్స్ స్థాపించడం ఇంకో కారణం. మన దేశంలో బిజినెస్ ప్రమోటర్ కల్చర్ ఎక్కువ. ప్రమోటర్లే కంపెనీ సీఈఓలు, వైస్ ప్రెసిడెంట్స్, డైరెక్టర్స్‌గా ఉంటారు . కానీ విదేశాల్లో అలా కాదు. ముగ్గురు, నలుగురితోని పెట్టిన మైక్రోసాఫ్ట్, గూగుల్ లాంటి కంపెనీలు ఎదిగాయి. ఇప్పుడు సక్సెస్ అవుతున్న స్టార్టప్‌లన్నీ నలుగురు కలిసి పెట్టినయే. నలుగురు కలిస్తే.. 'ఏం జేయాలె? ఎలా జేయాలే' అనేదానికి నాలుగు ఐడియాలొస్తయి. థాట్ ఎనర్జీ పెరిగితే ప్రొడక్ట్ క్వాలిటీ పెరుగుతది. ఇండస్ట్రీ నాలెడ్జ్, ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారిలో కాన్ఫిడెన్స్ ఎక్కువ. లోకల్ స్టార్టప్స్‌ల ఫౌండర్స్ యావరేజ్ నంబర్ మూడు ఉందిపుడు. సిలికాన్ వ్యాలీ స్టార్టప్స్ కూడా ఇలానే ఉన్నయ్.

ఇది యువకాలం. ఇనుప కండరాలు, ఉక్కునరాలు. వజ్ర సంకల్పం ఉంటే చాలు ఈ దునియాను ఏలేయొచ్చు. అసాధ్యాలు సుసాధ్యం చేసేయొచ్చు. ఆత్మవిశ్వాసం ఉంటే ఎంతటి కార్యాన్నయినా సాధించవచ్చని, పిరికితనం మనిషిని నిర్వీర్యం చేస్తే, ఆత్మవిశ్వాసం విజయ తీరాల వైపు నడిపిస్తుందని స్వామీ వివేకానంద సూచించారు. లక్ష్య సాధనలో అవరోధాలెన్నో ఎదురవుతాయని, అయినా నిస్పృహ చెందకుండా అనుకున్న గమ్యం చేరేవరకూ విశ్రమించవద్దని పిలుపిచ్చారు. పైపై అలల్లా కాకుండా సముద్రమంత లోతుగా ఆలోచించాలని, భౌతికంగా మానసికంగా బలహీనపరిచే దేన్నయినా విషతుల్యంగా విడిచిపెట్టాలని హితబోధ చేశారు. అలాంటి బోధనల స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న ఎంతోమంది యువత స్టార్టప్ లతో సంచలనాలు క్రియేట్ చేస్తున్నారు. ఒక్క ఐడియాతో వేలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. సంపదను క్రియేట్ చేస్తున్నారు. విజేతల స్ఫూర్తిని, విజయగాథనలు మహా.. ప్రతీవారం వెలుగులోకి తీసుకువస్తూనే ఉంటుంది. ఈ స్ఫూర్తి మరికొందరిలో స్ఫూర్తిని రగిలించాలనే మహా ఆకాంక్ష

# విజేత

ఒకే పని.. కొందరు అలవోకగా చేసేస్తారు. ఇంకొందరు అసలు పూర్తి చేయలేరు. ఉద్యోగం ఒకటే.. కొందరు ఉన్నచోటే ఆగిపోతారు. ఇంకొందరు శిఖరం చేరతారు. అలా శిఖరాలు అందుకునే వారే.. నిజమైన విజేతలు. విజేతలు ప్రతి పనిని ఒక ప్రణాళికా ప్రకారం విభజించుకుంటారు. క్రమం తప్పకుండా దాన్నే పాటిస్తారు. కెరీర్, వ్యాపారం ఏదైనా ఫలానా సమయానికి ఫలానాది సాధించాలనే స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు ఏర్పరచుకుంటారు. కొత్త ఆలోచనలు వినడానికి ఎప్పుడూ సిద్ధమే. వాళ్లకు పనికొచ్చే, ప్రేరణగా నిలిచే స్నేహితులే ఉంటారు తప్ప. పని చెడగొట్టే వారిని దూరం పెడతారు.



## సెన్సేషనల్ కావ్య కర్ణాటక

పాపులర్ ఇన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్ కావ్య కర్ణాటక అంబానీ ఇంటి పెళ్ళి వేడుక ప్రమోషన్ తిరస్కరించడం ద్వారా ఇండియాలో ట్రెండింగ్ గా మారారు. 'నేను అంబానీ పెళ్లిలో ప్రేక్షకులతో చేరాలని కోరుకోలేదు. అంతేకాకుండా అక్కడికి వెళ్లి నా కంటెంట్ లేదా బ్రాండ్ తో రాజీ పడాలని అనుకోలేదు. జియో ఇంటర్నెట్ ఛార్జీలను పెంచిన తరుణంలో అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాన్ని ప్రచారం చేయడంలో నేను నిజాయితీగా భావించాను. నా అభిమానులతో నేను నిజాయితీగా ఉండాలి. డబ్బు తీసుకుని ఈ పెళ్లిని ప్రమోట్ చేసి వారి నమ్మకాన్ని భంగపరచాలని అనుకోలేదు. అంబానీ పెళ్లికి హాజరు కావడం నా విలువలకు విరుద్ధం. ఇన్‌ఫ్లుయెన్సర్ గా, కంటెంట్ క్రియేటర్ గా ఇటువంటి ఈవెంట్‌ను ప్రచారం చేయడం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక లాభం కంటే నా చిత్తశుద్ధిని, ప్రేక్షకుల ప్రేమను కాపాడుకోవడం నాకు చాలా ముఖ్యం. పెళ్లిని ప్రమోట్ చేయడానికి నాకు రూ. 3.6 లక్షల ఆఫర్ వచ్చిందని.. దానిని తిరస్కరించడం సులభం కాదు. కానీ., నేను ఆ ఆఫర్‌ను అంగీకరించలేదని కావ్య కర్నాటక తెలిపింది. ఇలాంటి కావ్యకు దేశవ్యాప్త మద్దతు లభించింది. కావ్యకి సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 16 లక్షల మందికి పైగా ఆమెను అనుసరిస్తుండగా.. యూట్యూబ్‌లో ఆమెకు 7 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అక్కడ ఆమె భారతదేశంలోని విభిన్న సంస్కృతులను ప్రదర్శించే వీడియోలను చేస్తుంది. కావ్య తన పేరు మీద ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది. ఇపుడు ఫోర్బ్స్ 30 అండర్ 30లో ఎంపికైంది.

## నిర్దేశిత లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవు

■ బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజి వాకడే



**వరంగల్, మహా;** నిర్దేశిత పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం పన్ను వసూళ్ల పురోగతి పై ప్రధాన కార్యాలయం లో రెవెన్యూ అధికారులతో జరిగిన సమావేశం లో కమిషనర్ సమీక్షించి సమర్థవంతంగా వసూళ్లు జరపడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ గత వారం నిర్వహించిన పన్ను వసూళ్ల సమావేశ అనంతరం పన్నుల వసూళ్ల తీరు ఆశాజనకం గా లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చే వారం లోగా పన్ను వసూళ్ల లో పురోగతి లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి రోజు పన్ను వసూళ్ల తీరును డిప్యూటీ కమిషనర్ లు క్షేత్ర స్థాయి లో పర్యటించి పన్ను వసూళ్లు పై దృష్టి సారించాలని, ఆర్ ఓ లు డిప్యూటీ కమిషనర్ లు బాధ్యతాయుతంగా పన్ను వసూళ్లు జరిపేలా చూడాలని కమిషనర్ అన్నారు. ప్రాపర్టీ టాక్స్ వసూళ్ల లక్ష్యం 117. 34 కోట్లు కాగా ఇప్పటివరకు 48.27 కోట్లు అనగా 41.4% జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, రాజేశ్వర్ లతో పాటు పన్నుల అధికారి రామకృష్ణ ఆర్ ఓ లు షేహజాది బేగం శ్రీనివాస్ యూసుఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

- ఉత్సాహభరితంగా 2కే రన్ కు కదిలిన యువత
- డ్రగ్స్ నిర్మూలనపై టీఎస్ జేయూ పోరాటం అభినందనీయం
- వరంగల్ పోలీస్ కమిషనర్, బల్దియా కమిషనర్




**వరంగల్, మహా ;** యువత సరదాగా డ్రగ్స్ అలవాటు చేసుకొని, వాటికి బానిస అయి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మ మైదాన్ చౌరస్తా నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, ఎన్ యు జె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ లతో కలిసి జెండా ఊపి 2కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారికి బానిసలై యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సరదాగా కిక్ కోసమో, థ్రిల్ కోసమో మొదలయ్యే మత్తు మందుల అలవాట్లు యువత పాలిట శాపాలుగా మారుతున్నాయన్నారు. డ్రగ్స్ విషవలయంలో చిక్కుకుంటున్న యువత భవిష్యత్ సర్వనాశనం అవుతోందన్నారు. డ్రగ్స్ వ్యసనాలను వదులుకోలేని కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని బయట పడేసేందుకు సామాజిక సంస్థలు తమవంతుగా కృషి చేయాలని సూచించారు. ఇందులో భాగంగా టీఎస్ జెయు చేస్తున్న కృషిని కొనియాడారు. వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి యువత భవితవ్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తోందన్నారు. దేశ అభివృద్ధికి తోడ్పడాల్సిన విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి వారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జన్మలకంటే మానవజన్మ ఎత్తడం అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థానాలకు రావాలని కలలు కనాలి, వాటిని నిజం చేసుకోవడానికి అనునిత్యం కృషి చేయాలన్నారు. కానీ కొందరు డ్రగ్స్ మహమ్మారి ఊబిలో చిక్కుకోవడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ప్రభుత్వం డ్రగ్స్ సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటుందని గుర్తు చేశారు. టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి మన రాష్ట్రంతో పాటు ప్రపంచాన్ని గడగడలాడిస్తోందని అన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడి ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు . మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల మన మానసికంగా, శారీరకంగా కుంగుబాటుకు లోనవుతామని తెలిపారు. డ్రగ్స్ వల్ల జీవితాలు రోడ్డున పడతాయని అన్నారు. డ్రగ్స్ అలవాటు పడిన వారు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యుల జీవితాలు సైతం రోడ్డు పడతాయన్న విషయం గురించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదిగి మంచి కుటుంబంతో సంతోషంగా బతకాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోటి మందిని చైతన్యవంతం చేయాలని లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వరంగల్ ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తామని చెప్పారు. దశలవారీగా అన్ని జిల్లాలలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులుగా కేవలం వార్తలు రాసేందుకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతగా ప్రభుత్వానికి మద్దతుగా డ్రగ్స్ వినియోగంపై టిఎస్ జెయు ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ సంస్థల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి అతిథులను స్వాగతించి శాలువా మెమొంటోతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసిపి నందిరాం నాయక్, వరంగల్ ఎమ్మార్వో ఎండి ఇక్బాల్, కెఎంసి ప్రిన్సిపల్ రామ్ కుమార్ రెడ్డి, సిఐ లు షకూర్, తుమ్మ గోపి, జూపల్లి వెంకటరత్నం, ఒంటేరు రమేష్, ట్రాఫిక్ సిఐ రామకృష్ణ, నార్కోటిక్ సీఐ రవీందర్, వరంగల్ డిపిఆర్ఓ అయూబ్ ఆలి, డిప్యూటీ డిఎంహెచ్ఓ హరిసింగ్, ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డా సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కాకతీయ మెడికల్ కళాశాల జూడ అసోసియేషన్ బాధ్యులు, టీఎన్జీవోస్ బాధ్యులు రాజేష్, లయన్స్ క్లబ్ సభ్యులు రాజగోపాల్, తో పాటు యువజన సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్ని వర్గాల వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ములుగు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రాజు వర్ధన్, రంజిత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జనగామ జిల్లా అధ్యక్షులు నరేందర్ మరియు సభ్యులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల టిఎస్ జేయు యూనియన్ బాధ్యులు ముత్యం ముఖేష్ గౌడ్, మహమ్మద్ రియాజ్, జి ఆంజనేయులు, మెరుగు విష్ణుమోహన్ పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ బాధ్యతలు తోకల అనిల్ కుమార్ నాగపురి నాగరాజు రావుల నరేష్ వరంగల్ జిల్లా కమిటీ బాధ్యులు కందికొండ మోహన్ ఆవునూరి కుమారస్వామి, ఈద శ్రీనాథ్, లింగబత్తిని కృష్ణ కందికొండ గంగరాజు, బత్తుల సత్యం నీరుటి శ్రీహరి కౌడగాని మోహన్ రావు అడప అశోక్ అవినాష్ భాగ్య రాజు సురేష్ కమల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ జయంతి నిర్వాహక కన్వీనర్ ఎన్నిక



**హుజూర్ నగర్, ఫిబ్రవరి 12, మహా ;** మఠంపల్లి మండలము చెన్నాయపాలెం గ్రామానికి చెందిన బానోతు తులసి రామ్ నాయక్ ను శ్రీ సంత్ సేవాలాల్ జయంతి నిర్వాహక కన్వీనర్ గా ఏకగ్రీవంగా హుజూర్నగర్ నియోజకవర్గం గిరిజన నాయకులు ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆరాధ్య దైవం, సంత్ శ్రీ సేవాలాల్ జయంతి వేడుకలను ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15వ తారీఖున నిర్వహిస్తున్న క్రమంలో హుజూర్నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్నామని కార్యక్రమానికి కో కన్వీనర్ గా తేజావత్ సైదులు నాయకులు ఎన్నుకోవడం జరిగిందని. 15వ తారీఖున జరిగే సంత్ శ్రీ సేవాలాల్ భోగ్ భండారో కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన నాయకులు భూక్యా మంజీనాయక్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15న జరిగేసంత్ శ్రీ సేవాలాల్ జయంతిని ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మన సేవాలాల్ వేడుకలను ఘనంగా, పార్టీలకతీతంగా గిరిజనులు పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ ఎమ్మార్వో నాగార్జున రెడ్డి, మఠంపల్లి ఎమ్మార్వో లావూరి మంగా, గరిడేపల్లి ఎమ్మార్వో కవిత, పాలకీడు ఎమ్మార్వో కమలాకర్, మేళ్లచెరువు ఎమ్మార్వో పి.జ్యోతి, చింతలపాలెం ఎమ్మార్వో టి.సురేందర్ రెడ్డి అదే విధంగా అన్ని మండలాల ఎంపీడీవోలు, గిరిజన నాయకులు, ధరావత్ నవీన్ నాయక్, మాలోతు భీముడు నాయక్, తేజావత్ రవి నాయక్, ధరావతు రాజా నాయక్, భూక్యా నగేష్ రాథోడ్, రమావత్ నరి నాయక్, గుగులోతు శ్రీను నాయక్, భానోతూ భాస్కర్ నాయక్, అడ్వకేట్ ఇస్లావత్ బాలాజీ నాయక్, బానోతు వీటి నాయక్, భూక్యా చంద్రమౌళి నాయక్, పద్మాబాయి, మాజీ సర్పంచ్ లక్ష్మీబాయి, బానోత్ సైదా నాయక్ ఆర్టీసీ, ధరావత్ శౌరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఫాస్టర్స్ కమిటీ సమావేశం విజయవంతం



**హుజూర్ నగర్ ,ఫిబ్రవరి 12, మహా ;** హుజూర్ నగర్ పట్టణములోని సీయోను షాలేము ప్రార్థన మందిరములో బుధవారం సూర్యాపేట జిల్లా పాస్టర్స్ కమిటీ సమావేశం నియోజక వర్గ అధ్యక్షులు పాస్టర్ శామ్యూల్ గుండు ఆధ్వర్యములో విజయవంతముగా జరిగింది.కార్యక్రమంలో సుమారు 150 మంది పాస్టర్లు పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ ను యెహోషాపాతు, హుజూర్ నగర్ నియోజక క్రిష్టియన్ పాస్టర్స్ కమిటీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నంది పాటి శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటి అధ్యక్షుడు మీసాల గోవర్ధన్,గౌరవ సలహా దారులు కాసర్ల శ్రావణ్ కుమార్,జనరల్ సెక్రటరీ సైమన్, ట్రెజరర్ శామ్యూల్ కిరణ్ చేతుల మీదుగా ఎన్నిక చేయబడిన వారికి నియామక పత్రాలు అందజేస్తూ ఎన్నిక చేయబడిన వారికి శుభాకంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బిషప్ సుదర్శన్,ఆదాము, సంద్రపంగు ప్రసాద్, నతనీయేలు నాయక్,పౌలు రాజు,శామ్యూల్ , రాంబాబు,రూబేను,ఇస్సాకు,సాల్మన్ నాయక్ పాల్గొన్నారు.

## గేయ పరిమళాలు పుస్తకావిష్కరణ



**వరంగల్, మహా;** పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వీసి ఆచార్య నిత్యానందరావు, రిజిస్టర్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఆవిష్కరించారు . పుస్తక ఆవిష్కరణ అనంతరం వీసీ మాట్లాడుతూ ఈ గేయ పరిమళాలు అనే వ్యాస సంకలన పుస్తక సంపాదకుడు డాక్టర్ నోముల రాజు నేటి యువతను తెలుగు సాహిత్యం వైపు నడిపిస్తూ, సమాజంలో మానవీయతను పెంచుతున్నారు. వారికి నా అభినందన, ఆశీర్వాదాలు అన్నారు. ఈ సందర్భంగా రిజిస్టార్ ఆచార్య కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ డిగ్రీ, పీజీ చదివే పిల్లలతో సినిమాలలోని పాటల సాహిత్యం సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో అనే విషయాల మీద వ్యాసాలు రాయించడం సంపాదకుడు విద్యార్థులచే చేయించిన ఒక గొప్ప ప్రయోగం అని అభినందించారు.

## రెడ్ బకెట్ బిర్యాని పాయింట్ కు జరిమాన



**వరంగల్, మహా ;** వరంగల్ నగర పరిధి ఫోర్ట్ రోడ్ లో గల రెడ్ బకెట్ బిర్యానీ పాయింట్ యాజమాన్యానికి రూ.20 వేలు జరిమానా విధించినట్టు ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ , బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా. రాజారెడ్డి కి తెలిపారు. బల్దియా శానిటేషన్ అధికారులు ప్లాస్టిక్ రైడ్ బృందం సంయుక్తం గా బుధవారం ఫోర్ట్ రోడ్ లోని రెడ్ బకెట్ బిర్యానీ పాయింట్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో ఫ్రిడ్జి లో నిల్వ ఉంచిన బిర్యాని గుర్తించడం జరిగిందని, అంతే కాకుండా అపరిశుభ్ర పరిస్థితుల్లో నిర్వహణ కొనసాగుతున్నట్లు గుర్తించి కమిషనర్ ఆదేశాల మేరకు పెనాల్టీ విధించడం జరిగిందని ఇదే తరహా విధానాలు పునరావృతం ఐతే సదరు దుకాణాల ట్రేడ్ లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని సి ఎం హెచ్ ఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏం హెచ్ ఓ డా.రాజేష్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజ్ హెల్త్ అసిస్టెంట్ నరేష్ జవాన్ లు తదితరులు పాల్గొన్నారు.

# సర్వాంతర్యామిగా మారుతున్న డ్రోన్

■ పురుగుమందు పిచికారితో రైతులకు ఊరట



**హుజూర్ నగర్ ,ఫిబ్రవరి 12, మహా ;** వ్యవసాయంలో 20 ఏళ్ల క్రితం వరి కోత మిషన్లు వినియోగించినప్పుడు అనేకమంది వింతగా చూశారు ఇప్పుడు వరి కోత మిషన్ లేకుండా వరి పంట లేని పరిస్థితి వచ్చింది. అదేవిధంగా కొద్ది కాలం నుండి వ్యవసాయ రంగంలోకి పురుగుమందుల పిచికారి కోసం ప్రవేశించిన డ్రోన్ వినియోగం క్రమ క్రమంగా పెరుగుతూ ఇప్పుడు మఠంపల్లి మండలానికి వచ్చింది. రఘునాథ పాలెం గ్రామానికి చెందిన తోట కోటేశ్వరరావు రూ, 7లక్షలతో డ్రోన్ ను కొని తెచ్చి ప్రతి మిరప మరియు వరి పొలాలకు వినియోగిస్తూన్నాడు .ఈ డ్రోన్ తో మందు పిచికారి చేయడానికి ఎకరాకు ఒక్క నిమిషం మాత్రమే టైం పడుతుందని రోజుకి 15 నుండి 20 ఎకరాల వరకు మందులు పిచికారి చేయడం జరుగుతుందని తెలిపారు. పొలాలకు మందు పిచికారి చేయాలంటే ఇప్పుడున్న పరిస్థితులలో కూలీలు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నామని ఒకవేళ వారు దొరికిన దిగబడే పొలం అయితే కూలీలకు కొంత ఎక్కువ ఖర్చు ఇవ్వవలసి వస్తుందని ఎకరాకు చాలా మొత్తంలో ఖర్చు అవుతుందని అదేవిధంగా పురుగుమందులు కూడా పెద్ద మొత్తంలో కొనాల్సి వస్తుందని అన్ని రకాలుగా ఆలోచించి డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేయడంతో ఇటు సమయంతో పాటు అటు కూలీల ఖర్చు కలిసి వస్తుందని ఏ రిస్క్ కూడా ఉండదని రైతు పత్తి నాగేశ్వరరావు తెలిపారు. ఏది ఏమైనా డ్రోన్ ఇందు గలదు అందు లేదు అన్న సందేహం లేదు. ఎందెందు వెతికిన అందదు కలదు. నిజమే ఇప్పుడు గాల్లో చక్కర్లు కొట్టేందుకు ఈడ ఆడ అన్న తేడా లేదంటూ దూసుకుపోతుంది .పెళ్లిళ్లకు మాత్రమే పరిమితం అయిన డ్రోన్లు నా రూటే సపరేటు అంటూ బహిరంగ సభలు నాయకుల పాదయాత్రల తో మరింత వేగం పెంచింది. తాజాగా సరిహద్దులు దాటి సైనికుల రంగంలోకి దిగింది. జవాన్ కోసం మాత్రమే కాదు తాజాగా జై కిసాన్ అంటూ నిలదీస్తుంది పంటల సాగుకు తోడ్పడుతూ.. మందుల పిచికారికి నేను సైతం అంటూ అన్నదాతకు అండగా నిలుస్తుంది. విత్తనాలు చల్లుకోవడం నుంచి ఎరువులు, పురుగు మందులు వేయడం, పంటల అంచనా, పంటలకు అందించాల్సిన పోషకాలు అందించడంతో పాటు పలు అంశాల్లో ఈ టెక్నాలజీ ప్రయోజనకారిగా మారింది. పొలంలో మందు పిచికారి చేస్తున్న డ్రోన్ చూడటానికి కొందరి రైతులు రోడ్ల వెంట బైక్ లు ఆపి పొలాల వద్దకు వచ్చి మరీ చూడటం విశేషం.

## పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహుకరణ



**హుజూర్ నగర్, ఫిబ్రవరి 12, మహా ;** హుజూర్నగర్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు హుజూర్నగర్ గ్రామ వాసి కీర్తిశేషులు శ్రీమతి కొత్త శోభారాణి జ్ఞాపకార్థం వారి కుమారుడు కొత్త సిద్ధార్థ, మల్లిక సుమారు 12 వేల రూపాయల విలువైన సౌండ్ సిస్టంను బుధవారం బహుకరించారు. సౌండ్ సిస్టం ను పాఠశాల నోడల్ ఆఫీసర్ బీరెల్లి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద కు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు పిడిలు పాల్గొన్నారు.

# సమ్మక్కా.. సల్లంగా చూడు తల్లీ..





**ములుగు / తాడ్వాయి, మహా :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మినీ మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి లక్షలాదిమంది భక్తులు తరలి వస్తున్నారు. సమ్మక్క సారమ్మ గద్దెల ప్రాంగణమంతా భక్తులతో నిండిపోయి కళకళ లాడుతోంది. గద్దెల చుట్టూ ఉన్న క్యూ లైన్ బారికేడ్లన్నీ నిండిపోయాయి. మేడారం వనదేవతల మండమెలిగే పండుగా (మినీ జాతర) సందర్భంగా సమ్మక్క సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద అమర్చిన నల్లాలకింద్ స్నానాలు ఆచరించి, కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి సమ్మక్క సారలమ్మ పూనకాలతో తల్లులకు జేజేలు పలుకుతూ గద్దెలవద్దకు చేరుకున్నారు. దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన క్యూ లైన్ల ద్వారా భక్తులు పోలీసు భద్రత నడుమ అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీర సారె, ఎత్తుబంగారం సమర్పించి ముక్కులు చెల్లించుకుంటున్నారు. మొన్నటి దాకా పంట పొలాలతో, పచ్చని బయళ్ళతో కళకళలాడిన మేడారం నేడు లక్షలాదిమంది భక్తులతో కిటకిటలాడుతూ దర్శనమిస్తుంది. అధికారులు అన్ని వసతులు కల్పించామని చెప్పినప్పటికీ లోటు కనిపిస్తున్నదని భక్తులు చెబుతున్నారు.

**ఈ సారి పూజలు మాత్రమే..**


గిరిజన సాంప్రదాయం ప్రకారం అమ్మవార్లను ప్రతీ రెండు సంవత్సరాలకొకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున గద్దెలపై ప్రతిష్ఠచేసి అమ్మవార్లను దర్శించుకునే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తారు. అయితే ఇప్పుడు జరిగే జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకురారు. అమ్మవార్లు కొలువై ఉన్న ఆలయాలను, సామాగ్రిని శుభ్రపరిచి, మండమెలిగే పండుగను నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తారు. అయితే పెద్ద జాతరకు వెళ్లొచ్చిన భక్తులు మినీ మేడారం పేరుతో ఇంటిలోనే అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయేతే ఈ సారి మినీ జాతరకు సైతం తెలుగు రాష్ట్రాలతోపాటు చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలనుండి కూడా మహా మేడారం తరాహాలోనే భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకొని తరిస్తున్నారు.

**జంపన్న వాగులో కనిపించని నీటి జాడ..**

మినీ జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.5.30కోట్ల నిధులతో భక్తులకు సౌకర్యాలు కల్పించామని అధికారులు తెలుపగా మంచినీరు, మరుగుదొడ్ల విషయంలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లులను దర్శించుకునే ముందు జంపన్నవాగులో స్నానమాచరించడం ఆచారం కాగా వాగులోకి నీరు విడిచిపెట్టలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. వాగువద్ద ఏర్పాటు చేసిన నల్లాల వద్దే స్నానం ఆచరించడం జరుగుందని భక్తులు తెలిపారు.



## బైరి నాగయ్య కు డాక్టరేట్



**హుజూర్ నగర్, ఫిబ్రవరి 12, మహా ;** మఠంపల్లి మండలం యాతవాకిళ్ళ గ్రామానికి చెందిన బైరి నాగయ్య ఎంఏ పూర్తి చేశాక జానపద సాహిత్యంలో పరిశోధన చేయాలని సంకల్పించాడు. అదే దిశగా ప్రయత్నాలు ఆరంభించి 2014 2025 మధ్యకాలంలో ఆచార్య గోన నాయక్ పర్యవేక్షణలో పరిశోధనా అంశం సిద్ధం చేసి సంబంధిత విభాగాధిపతికి అందజేశారు. యాతవాకిళ్ళ, అమరవరం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన నాగయ్య ప్రస్తుతం గరిడేపల్లి మండలం కల్మల చెరువు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తెలుగు స్కూల్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో పేదరికానికి చదువు అడ్డురాదని దృఢ సంకల్పం పట్టుదలతో ఎంఏ పూర్తి చేసి అహర్నిశలు శ్రమించి పరిశోధనలో ప్రవేశాన్ని సాధించాడు. తెలుగు విభాగములు పిహెచ్డి చేసి జానపద గేయాలలో సామాజిక జీవన చిత్రం అను అంశంపై పరిశోధన చేసి జానపద జీవనాన్ని చిత్రించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఫిబ్రవరి 11న డాక్టరేట్ అందుకోవడం గర్వించదగ్గ విషయమని మండల, గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు స్నేహితులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు..
# కఠిన చర్యలుతీసుకోవాలి

■ ములుగు ఎస్పీ శబరీష్



**ములుగు, మహా :** ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ శబరీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డి.ఎస్.పి రవీందర్, ఇన్స్పెక్టర్లు , సబ్ ఇన్స్పెక్టర్లతో బుధవారం ఎస్పీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పోలీస్ అధికారులు ములుగు జిల్లా లోని మైనింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రాంతాలలోనే రాయల్టీ రుసుము చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టాలని, ములుగు జిల్లా గోదావరి నదీ పరివాహక ప్రాంతమైనందున, ఇసుక అక్రమంగా తరలించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అక్రమంగా ఇస్సుక తవ్వే ప్రాంతాలను గుర్తించి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆకస్మిక తనిఖీల ద్వారా ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా వెంటనే చట్ట ప్రకారం జరిమానాలు విధిస్తూ , వాహనాలను జప్తు , కేసులు నమోదు చేయాలన్నారు. జీరో బిల్లులు, డబుల్ ట్రిప్, అదనపు లోడ్, నకిలీ బిల్లులు, తప్పుడు వాహనంలో రవాణా, తప్పుడు గమ్య స్థానం, అలాంటి ఉల్లంఘన, అక్రమాలపై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), పీడీపీపీ, మైనింగ్ చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేపట్టే నిర్వాహకుల పేర్లను తప్పకుండా బయటకు తీసుకువచ్చి వారిపై చర్యలు తీసుకోవాలి ఎస్పీ శబరీష్ జిల్లా పోలీసులను ఆదేశించారు.

# 10 ఎకరాలు ఉన్న రైతుకు డ్రిప్పు, స్పింక్లర్లు వచ్చేలా చూస్తాం

■ రాప్తాడు నియోజకవర్గ రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ
■ 3మండలాల రైతులకు డ్రిప్పు, స్పింక్లర్లు పంపిణీ
■ కోళ్ల పెంపకం యూనిట్లు కూడా అందజేత
■ పరిటాల కుటుంబం గురించి మరోసారి మాట్లాడితే ఊరుకునేది లేదు
■ ప్రకాష్ రెడ్డి ట్రాప్ లో వైసీపీ శ్రేణులు పడవద్దన్న పరిటాల సునీత



**అనంతపురం, మహా ;** అనంతపురం జిల్లా వంటి కరవు ప్రాంతంలో రైతులకు డ్రిప్పు స్ప్రింక్లర్లు ఎంతో అవసరమని.. అందుకే 10 ఎకరాలు ఉన్న రైతుకు కూడా వీటిని సబ్సిడీపై అందించేలా చూస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల రైతులకు సబ్సిడీపై మంజూరైన డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందజేశారు. మూడు మండలాలకు చెందిన 840 మంది రైతులకు ఇవి మంజూరు కాగా.. బుధవారం రోజు 214మంది రైతులకు వీటిని అందజేశారు. వీటి విలువ రెండు కోట్ల 60లక్షలు ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఇందులో అనంతపురము రూరల్ మండలంలో 195 మందికి, ఆత్మకూరు మండలంలో314 మందికి, రాప్తాడు మండలంలో 331 మంది రైతులకు వీటిని మంజూరు చేశారు. రాప్తాడు మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, అధికారులు, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. మరోవైపు ఈ మూడు మండలాలకు చెందిన రైతులకు పెరటి కోళ్ల పెంపకం యూనిట్లను కూడా మంజూరు చేశారు.అనంతపురం రూరల్ మండలంలో 54మందికి, ఆత్మకూరు మండలంలో 55 మందికి, రాప్తాడు మండలంలో 20మందికి చొప్పున మొత్తం 129మందికి మంజూరు చేశారు. వీటిని అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రిప్పు,స్ప్రింక్లర్లను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇవి మంజూరు కాక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు ఎన్నికల చివరి ఏడాదిలో అరకొరగా మంజూరు చేశారన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందిస్తోందన్నారు. అయితే ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ ఉంటుందని 10ఎకరాలు ఉన్నరైతుకు 70% సబ్సిడీ ఉందన్నారు. 10ఎకరాలు ఉన్నరైతుకు కూడా పూర్తిస్థాయిలో సబ్సిడీ అందించాలని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి 10 ఎకరాలు ఉన్న రైతుకు కూడా త్వరలో డ్రిప్పు, స్ప్రింక్లర్లు 90శాతం సబ్సిడీపై మంజూరు చేసే విధంగా చేస్తామని సునీత అన్నారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా చాలా ఆదాయం ఉంటుందని... ఇంటి వద్దనే ఉండి ఉపాధి పొందవచ్చన్నారు. ఒక యూనిట్ విలువ 6వేలు కాగా సబ్సిడీ రూ.3600 అందిస్తున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ఇది పూర్తిగా రైతులు పక్షాన నిలబడుతున్న ప్రభుత్వం అని ఆమె స్పష్టం చేశారు....

**వైసీపీ శ్రేణులు ప్రకాష్ రెడ్డి ట్రాప్ లో పడవద్దు**

అధికారంలో ఉండగా కనీసం గ్రామాలకు రోడ్లు కూడా వేయలేని ప్రకాష్ రెడ్డి... అధికారం పోయాక రాజకీయ కక్షలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా గ్రామాలకు రోడ్లు వేశామని.. ఇప్పటికే 30 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. అలాగే బీటీ రోడ్లు కూడా పెద్ద ఎత్తున మంజూరు చేశామన్నారు. త్వరలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అయితే ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రకాష్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల కనగానపల్లి మండలం గుంతపల్లిలో వ్యక్తిగత కారణాలతో ఇద్దరు వ్యక్తులు గొడవపడితే. అది పరిటాల కుటుంబం పై నెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇందులో ఇరు వర్గాలకు గాయాలయ్యాయని.. ఇరు వర్గాల మీద కేసులు కూడా పెట్టారన్నారు. అలాంటప్పుడు పరిటాల కుటుంబం ప్రమేయం ఎక్కడ ఉందని ఆమె ప్రశ్నించారు. ప్రకాష్ రెడ్డి ఇంటి వద్దకు కనీసం కుక్కలు కూడా పోలేదని.. వైసీపీ శ్రేణులను తన వైపు తిప్పుకునేందుకు పరిటాల కుటుంబాన్ని మధ్యలోకి లాగుతున్నారని అన్నారు. ప్రకాష్ రెడ్డి ట్రాప్ లో పడితే వైసీపీ శ్రేణులు దెబ్బ తినే అవకాశం ఉందని.. ఆయన కుట్రలను ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలన్నారు. అధికారంలో ఉన్న సమయంలో పోలీసులను అడ్డం పెట్టుకుని మహిళలని కూడా చూడకుండా అక్రమ కేసులు పెట్టించారని మండిపడ్డారు. ఇప్పుడుఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా పరిటాల కుటుంబాన్ని లాగుతున్నారని.. మరోసారి ఇలాంటివి జరిగితే ప్రకాష్ రెడ్డి పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాల్సి ఉంటుందని ఎమ్మెల్యే సునీత హెచ్చరించారు.

## రాష్ట్రం మంత్రివర్గంలోకి రంగారెడ్డిని తీసుకోవాలి

■ మంత్రివర్గ విస్తరణలో అవకాశం ఇవ్వాలి
■ కాంగ్రెస్ పార్టీ నాయకులు అమ్మనబోలు భరత్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 12 మహా:** ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి పదవి ఇవ్వాలని అమ్మనబోలు భరత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో గత సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున రంగారెడ్డి జిల్లాలో గెలిచిన ఒకే ఒక ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అని తెలిపారు. తొలిసారి ఎమ్మెల్యేగా 1994లో మలక్ పేట్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. మరొక్కసారి 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజలలో ఉంటూ, ప్రజల కోసమే పనిచేస్తున్న నాయకుడు, ఇంతటి అనుభవజ్ఞశాలి, సీనియర్ శాసనసభ్యులైన మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిందేనని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు అమ్మనబోలు భరత్ రెడ్డి తేల్చి చెప్పారు. గత 30 సంవత్సరాలుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లేకపోవడం, పార్టీ కార్యకర్తలు నాయకులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసి నేడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా రంగారెడ్డిని గెలిపించుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మల్ రెడ్డి రంగారెడ్డికి అవకాశం కల్పించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని భరత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఉప్పల్ స్టేడియంలో సెలబ్రిటీ క్రికెట్ లీగ్-2025

■ నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత
: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్
■ రాజీవ్ గాంధీ స్టేడియంలో ఈనెల 14,15 తేదీల్లో
రోజుకు రెండు టీ20 మ్యాచ్ లు



**ఉప్పల్,మహా :** ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పదకొండవ సీజన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్2025క్రికెట్ పోటీలలో భాగంగా ఈ నెల 14 & 15 తేదీల్లో ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరగనున్న టీ20 మ్యాచ్ ల నిర్వహణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్ల గురించి రాజీవ్ గాంధీ ఉప్పల్ స్టేడియంలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపిఎస్ సీసీఎల్ నిర్వాహకులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం అధికారులు, జిహెచ్ఎంసి, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో పాటు ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, రిజర్వ్ పోలీసు వంటి వివిధ పోలీసు విభాగాలు నుండి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో సీపీ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ ఉప్పల్ స్టేడియంలో జరిగే క్రికెట్ మ్యాచ్ ల శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, తగిన విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, వివిధ భాషల సినిమా తారలు పాల్గొనే సెలబ్రిటీ క్రికెట్ పోటీలు కావటం వల్ల భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలని అధికారులకు సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరుగనున్న అన్ని రకాల క్రికెట్ మ్యాచ్ ల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన అన్ని రకాల సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సెలబ్రెటీ క్రికెట్ లీగ్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కూల్ డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాల ధరలు నిబంధనల మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.స్టేడియం పరిసరాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులకు, ఇతరులకు ఇచ్చే పాసుల జారీలో తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్బి డీసీపీ జి. నరసింహా రెడ్డి, ఎస్ఓటి డిసిపి రమణ రెడ్డి, ట్రాఫిక్ డిసిపి మల్లారెడ్డి, హెడ్ క్వార్టర్ డిసిపి శ్యాం, మల్కాజ్గిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, అడిషనల్ డిసిపి సిఎస్డబ్ల్యు ఏసిపి శ్రీనివాసరావు, మల్కాజ్గిరి ఏసిపి చక్ర చక్రపాణి, సెలబ్రెటీ క్రికెట్ లీగ్ ఫౌండర్ విష్ణు వర్ధన్ ఇందూరి మరియు బృంద సభ్యులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## యువతిపై పెట్రోల్ పోసిన ప్రేమోన్మాది




**హుజూర్ నగర్, ఫిబ్రవరి 12, మహా ;** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ముత్తయ్య ఏఎస్ఐ లు బలరాం రెడ్డి, సురేందర్ లతో కలిసి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఖమ్మం జిల్లా బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన సుందర్ ప్రమోద్ కుమార్ అనే వ్యక్తి అదే గ్రామానికే చెందిన తన స్కూల్ జూనియర్ యువతిని కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో ఆయువతి 3 నెలల నుండి హుజూర్ నగర్ పట్టణంలోని తన మేనమామ ఇంటి వద్ద ఉంటూ కోదాడ రోడ్డుకు గల దీపెన్ ఏఐ ఆఫీస్ నందు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. సోమవారం మధ్యాహ్నం 02.30గంటల సమయంలో సదరు యువతికి ఫోన్ చేసి మాట్లాడాలని రమ్మని కోరగా ఆమె ఆఫీస్ నుండి బయటకు రాగా తనను ఎందుకు ప్రేమించడం లేదని ఆమెతో గొడవపడి తన వెంట తెచ్చుకున్న బాటిల్ పెట్రోల్ ఆమెపై పోసి చంపడానికి ప్రయత్నించినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంబించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి వద్ద నుండి ద్విచక్ర వాహనాన్ని సెల్ ఫోన్, పెట్రోల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వెల్లడించారు.

## జగద్గురు సంత్ శిరోమణి గురు రవిదాస్ మార్గం బహుజన జాతులు అనుసరించాలి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 12 మహా :** సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ ధర్మస్థల్ కొంగరకాలన్ లో భారతదేశ బహుజన ప్రవక్త, బాబా సాహెబ్ అంబేద్కర్ మరియు మన్యావర్ కాన్సిరాం గార్ల రాజకీయ, సామాజిక మార్గ నిర్దేశకులు,చైతన్య దీప్తి, భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమ సింహం షహీద్ ఉద్దం సింగ్ స్ఫూర్తి దాత జగద్గురు సంత్ శిరోమణి గురు రవిదాస్ 648 వ జయంతి వేడుకలను, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జీ రాజు, వైస్ చైర్మన్ ఎన్ దామోదర్, ధర్మ ప్రచారక్ డా కిషోర్ కుమార్, బిజెపి వనపర్తి జిల్లా ఇంచార్జ్ బోస్ పల్లి ప్రతాప్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. (15వ శతాబ్దం) భారతదేశంలో సామాజిక న్యాయం, ఆధ్యాత్మిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడు. చమార్ కులంలో జన్మించినప్పటికీ, ఆయన "మన చేతనలోనే భగవంతుడు ఉన్నాడు" అనే సందేశం ద్వారా జాతి, వర్ణ భేదాలను తిరస్కరించి మానవత్వాన్ని ఎత్తిపట్టారు. ఆయన భజనలు, దోహాలు, సామాన్య ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రసారం చేశాయి. సామాజిక, సాంస్కృతిక ప్రభావం, ప్రపంచ పరివర్తనకు స్ఫూర్తి నిచ్చిన ఫ్రెంచ్ విప్లవం, సోషలిస్టు విప్లవాల కంటే ముందే సంత్ శిరోమణి గురు రవిదాస్ జి "బేగంపురా" అనే నూతన సమాజ నిర్మాణా సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. బేగంపుర (శోక రహిత సమాజం) భావనను ప్రచారం చేస్తూ, స్త్రీ విద్య, దళితుల గౌరవానికి పోరాడారు. ఆయన బోధనలు కుల వ్యవస్థను ప్రశ్నించి, దళిత సశక్తికరణానికి ప్రేరణగా మారాయి. సాంస్కృతిక వారసత్వం: ఆయన రచనలు "గురు గ్రంథ్ సాహిబ్" లో స్థానం పొంది, సిక్కు, హిందూ సంప్రదాయాలను సుసంపన్నం చేశాయి. రవిదాసియా ధర్మం నేటికీ కోట్లాది మందికి మార్గదర్శకంగా నిలిచింది. నేటి ప్రస్తుతత: రవిదాస్ జయంతి (మాఘ పూర్ణిమ) నాడు, ఆయన సేవా భావన, సామరస్య సందేశాలను స్మరించుకుంటాము. ఆధునిక సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం ఆయన బోధనలు ఎంతగానో అవసరం. "ప్రేమే భగవంతుడు" అన్న రవిదాస్ తత్వం, మానవాళిని ఐక్యం చేయడానికి నిరంతరం ప్రేరేపిస్తుంది. ఆయన జీవితం సామాజిక మార్పు యొక్క దీపస్తంభంగా నిలిచి ఉంది!. లింగాల విజయ్, మొండిగౌరెల్లి మాజీ సర్పంచ్ బండమీది కృష్ణ, మేడిపల్లి మాజీ సర్పంచ్ బోడ కృష్ణ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం జాక్ చైర్మన్ కంబలపల్లి భాస్కర్, వైస్ చైర్మన్ యాదయ్య, ఎమ్మార్పీఎస్ మంచాల మండలం అధ్యక్షులు పల్లాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరను సందర్శించిన ఐటిడిఏ పిఓ



**తాడ్వాయి, మహా :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మినీ జాతర ప్రారంభంకాగా ఏటూరునాగారం ఐటిడిఏ పిఓ చిత్రా మిశ్రా బుధవారం సాయంత్రం సందర్శించారు. జాతరలో ఏర్పాటు చేసిన ఐటీడీఏ గెస్ట్ హౌస్‌లోని కంట్రోల్ రూంను తనిఖీ చేసి సంబంధిత శాఖలను సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. మేడారం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన భోజన తయారీని పరిశీలించారు. 24 గంటలూ విధులు నిర్వర్తించే సిబ్బందికి పరిశుభ్రమైన ఆహారం, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వంట కోసం వచ్చిన స్టాక్‌లను పరిశీలించి, అందుబాటులో ఉన్న బ్యాలెన్స్ స్టాక్ వివరాలను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు, అనంతరం ఆదివాసీ గిరిజన మ్యూజియాన్ని సందర్శించి, ఆవరణలో పారిశుద్ధ్య ఏర్పాట్లు, మ్యూజియంలోని వస్తువులపై యాత్రికులకు సరైన మార్గనిర్దేశం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ పోచం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, పీఈఎస్ఏ కోఆర్డినేటర్ ప్రభాకర్, అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ క్షేత్రయ్య, జీసీడీఓ సుగుణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంట ఉన్నారు.


## లోన్ బకాయి – రైతు ఇంటి గేటు జప్తు

■ డీసీసీబీ అధికారుల చర్యపై రైతు కుటుంబం ఆవేదన
■ పాలకుర్తిలో బ్యాంకు అధికారుల తీరుపై విమర్శలు
■ రుణ బకాయిల వసూళ్లలో క్రూరంగా వ్యవహరిస్తున్న బ్యాంకులు.
■ రైతుల సంక్షేమంపై ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు



**జనగామ, మహా :** పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో డీసీసీబీ బ్యాంక్ నుండి రుణం తీసుకున్న రైతు బకాయి చెల్లించలేదని, బ్యాంకు అధికారులు అతని ఇంటి గేటును జప్తు చేసి తీసుకెళ్లారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తూ, తాము కష్టాల్లో ఉన్నప్పటికీ ఇలాంటివిధంగా వేధించడమా? అని ప్రశ్నిస్తోంది. గ్రామస్తులు ఈ ఘటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారుల తీరును ఖండిస్తూ, రైతులకు మరింత సానుభూతితో వ్యవహరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మేడారంలో ఘనంగా మండ మెలిగే పండుగ వేడుక



**ములుగు /తాడ్వాయి :** ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క సారక్కల మినీ జాతరకు అంకురార్పణలో ప్రధాన ఘట్టం మండమెలిగే పండుగ. ఈ మండ మెలిగే పండుగను బుధవారం గిరిజన పూజారులు ఘనంగా నిర్వహించారు. మండ మెలిగే పండుగతో జాతర ప్రారంభమైనట్లుగా ఆదివాసీలు భావిస్తారు. సమ్మక్క కొలువైన మేడారం, సారలమ్మ ఉన్న కన్నెపల్లి, కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్లలోని పగిడిద్దరాజు గుడులను వేకువజామునే పూజారులు ఆలయాలను పుట్టమట్టితో గుడులు అలికి... మామిడి తోరణాలతో పూజారులు అలంకరణ చేశారు. మేడారంలోని సమ్మక్క ప్రధాన పూజారి ఇంటి నుంచి డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమలతో మేడారం చుట్టూ ఊరేగింపు నిర్వహించి, గిరిజన ఆడపడుచులు సమ్మక్క గుడికి వెళ్లి పూజలు, గ్రామ బొడ్రాయికి శుద్ధ జలంతో అభిషేకాలు, పూజలు నిర్వహించి బూరుగు కొమ్మలతో దిష్టి తోరణాలు కట్టారు. ఆదివాసీ ఆచార సంప్రదాయాల ప్రకారం ఉపవాస దీక్షలతో మండమెలిగే పండుగ చేస్తారు. బుధవారం రాత్రి గద్దెల చెంత పూజలు చేసి తల్లులకు నైవేద్యాలు సమర్పించి రేపు ఉదయం వరకు పూజలు నిర్వహిస్తారు. 12 నుండి 15 వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జాతర కొనసాగనుంది. తల్లుల వద్ద భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## మీ సేవ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**ములుగు, మహా :** ములుగు జిల్లా కేంద్రంలోని మీ సేవకేంద్రాలను జిల్లా పౌరసరఫరా అధికారి సయ్యద్ పాషా ఫైసల్ హుస్సేన్, ఈ డిస్టిక్ మేనేజర్ దేవేందర్, డిప్యూటీ తహశిల్దార్ నితీష్, మీ సేవ జిల్లా మేనేజర్ విజయ్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార భద్రత కార్డు దరఖాస్తు సర్వీస్ గురించి మీసేవ కేంద్ర నిర్వాహకులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రజలు నిర్ణీత రుసుము చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా అప్లికేషన్ నమోదు చేయాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన, గ్రామసభ ద్వారా దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు మరల దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్క మీసేవ సెంటర్లో సిటిజన్ చార్టర్, మీసేవబోర్డు , ఇంటర్నెట్, స్టేషనరీ తప్పకుండా ఉండాలని, దరఖాస్తు దారునితో దురుసుగా ప్రవర్తించవద్దని తెలిపారు. నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువగా తీసుకున్నట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని మీసేవ కేంద్ర యజమానులను హెచ్చరించారు. దరఖాస్తుదారునికి తప్పనిసరిగా మీసేవ రశీదు పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. అదే విధంగా భవన నిర్మాణ కార్మికుల ప్రయోజనం కోసం తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ శాఖ ప్రవేశపెట్టిన లేబర్ కార్డు సర్వీసును అందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనధికారిక లొకేషన్లలో మీసేవ లాగిన్ ఉపయోగించి ఏదైనా దరఖాస్తు లు చేస్తే ఆ మీసేవ కేంద్రాన్ని, లాగిన్ ఐడిని తొలగిస్తామని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ హెచ్చరించారు.

# కల్తీ కల్లు పై పోలీసులు కన్నేర్ర



**వరంగల్, మహా;** వరంగల్ గిర్మాజిపేట కు చెందిన గోడిశాల యుగంధర్ తండ్రి పేరు చిన్నమళ్ళు, జూలూరి విక్రమ్, తండ్రి పేరు: స్వామి, జూలూరి నాగరాజు తండ్రి పేరు వెంకటేశ్వర్లు, పాండవుల నరేష్ తండ్రి పేరు వీరస్వామి అను నలుగురు వ్యక్తులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వరంగల్ లక్ష్మీపురంలో కల్తీకల్లు తయారు చేస్తూ వాటిని ఆటోలో పెట్టుకొని సీసాకి 40 రూపాయల చొప్పున అమ్మేస్తున్నారు. విషయాన్ని పసిఘట్టిన ఇంతే జార్గంజ్ పోలీస్ వారు పెట్రోలింగ్ డ్యూటీలో ఉండగా పైన పేర్కొన్న నలుగురు వ్యక్తులు పోలీసు వారిని చూసి ఆటోను అందులో ఉన్న 600 సీసాల కల్తీ కల్లును వదిలి పారిపోయే ప్రయత్నం చేయగా వెంటనే వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే పొగాకు సారంగపాణి , కామారెడ్డి నరేందర్ గౌడ్ ల తో కలిసి వరంగల్ లక్ష్మీపురం లోనే పోస్టర్ కలర్, షుగర్, సోడా, కుంకుడు కాయలు, చాకోలిన్ పౌడర్ అను పదార్థాలను నీటిలో కలిపి కల్తీకల్లు తయారుచేసి ఒక్క సీసా 40 రూపాయల చొప్పున అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలుపగా అట్టి నలుగురి వ్యక్తులను పోలీస్ స్టేషన్కు తీసుకొని వచ్చి కేసు నమోదు చేయడం జరిగింది. వారి వద్ద నుండి 600 సీసాల కల్తీ కళ్ళు దాని విలువ సుమారు 24 వేల రూపాయలు కలిగి ఉంటుందని వాటిని పోలీసులు స్వాధీన పరుచుకొనడం జరిగిందని ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.ఏ సుకూర్ తెలిపారు.

ANN తెలుగు
మహా పత్రిక 07
గురువారం, హైదరాబాద్ | 13-02-2025
వ్యాపార వార్తలు | BUSINESS NEWS
WWW.MAHAADAILY.COM



# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం నష్టాలతో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ26 పాయింట్లు నష్టపోయి 23,045 వద్దకు చేరింది. సెన్సెక్స్ 122 పాయింట్లు దిగజారి 76,171 వద్దకు చేరింది. ఇటీవల భారీగా మార్కెట్‌లు పడిపోతున్నాయి. గతవారం ట్రెండ్ ఈవారం కొనసాగే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్ సర్వ్, టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఆల్ట్రాటెక్ సిమెంట్, జొమాటో, టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ స్టాక్‌లు లాభాల్లో ముగిశాయి. ఎం అండ్ ఎం, ఐటీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టైటాన్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా స్టాక్‌లు భారీగా నష్టపోయాయి.



# భారీగా పడిపోయిన పామాయిల్ దిగుమతులు

భారత్ పామాయిల్ దిగుమతులు 2025 జనవరిలో 14 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. అదే సమయంలో సోయా దిగుమతులు భారీగా పెరిగాయి. సోయా దిగుమతులు మునుపటి సంవత్సరంతో పోలిస్తే రెట్టింపు కంటే ఎక్కువ నమోదయ్యాయి. పామాయిల్ శుద్ధి చేసేందుకు అయ్యే ఖర్చు.. దానివల్ల సమకూరే మార్జిన్లు సోయా దిగుమతులకు కారణమైనట్లు నిపుణులు చెబుతున్నారు. పామాయిల్ దిగుమతులు పడిపోవడానికిగల కొన్ని కారణాలను విశ్లేషిస్తున్నారు.దిగుమతి చేసుకున్న పామాయిల్ రిఫైనింగ్ మార్జిన్లు తక్కువగా ఉంటున్నాయి. చాలా కంపెనీల రెవెన్యూపై దీని ప్రభావం పడుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కొన్ని ప్రాంతాలు పామాయిల్ ధరలను టన్నుకు 80-100 డాలర్లు తగ్గించాయి. అయినప్పటికీ దిగుమతులు మందగించాయి. ఇండోనేషియా, మలేషియా వంటి ప్రధాన పామాయిల్ ఉత్పత్తి దేశాలు ఎగుమతి సరఫరాలను కఠినతరం చేశాయి. ఇది సోయా నూనె వైపు మళ్లడానికి మరింత ప్రోత్సహించింది. ప్రపంచంలోనే అత్యధికంగా కూరగాయల నూనె(ఎడిబుల్ ఆయిల్)లను కొనుగోలు చేస్తున్న భారత్ పామాయిల్ దిగుమతులు తగ్గడం ప్రపంచ మార్కెట్లపై గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణులు భావిస్తున్నారు. భారత్ నుంచి డిమాండ్ తగ్గడంతో మలేషియా పామాయిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరిలో పామాయిల్ దిగుమతులు స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ అవి సాధారణం కంటే తక్కువగానే ఉంటాయని భావిస్తున్నారు. సోయా దిగుమతులు కొద్దిగా తగ్గవచ్చని, సన్‌ఫ్లవర్ నూనె దిగుమతులు స్వల్పంగా పెరగవచ్చని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) అంచనా వేసింది.



# మెహుల్ చోక్సీకి క్యాన్సర్ చికిత్స

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.13,500 కోట్ల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ బెల్జియంలో క్యాన్సర్ చికిత్స పొందుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చోక్సీ తరపు న్యాయవాది విజయ్ అగర్వాల్ ఇటీవల ముంబయిలోని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ప్రత్యేక కోర్టుకు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. చోక్సీని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా (ఎఫ్ఈఓ) ప్రకటించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రయత్నిస్తోంది. దాంతో ఆయన ఆస్తులను జప్తు చేసేందుకు ప్రభుత్వానికి వీలు కలుగుతుంది. చోక్సీ తన బంధువు నీరవ్ మోదీతో కలిసి మోసపూరిత లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్ఓయూ), ఫారిన్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎఫ్ఎల్‌సీ) ద్వారా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB)లో రూ.13,500 కోట్లకు పైగా మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2018 నుంచి కొనసాగుతున్న ఈ కేసు తదుపరి విచారణను ముంబయి కోర్టు ఫిబ్రవరి 27కి వాయిదా వేసింది. చోక్సీ ఆరోగ్య పరిస్థితి కారణంగా ప్రయాణం చేయలేకపోతున్నాడని, ఆయనను ఎఫ్ఈఓగా ప్రకటించడం అన్యాయమని తన తరపు న్యాయవాది వాదించారు. ఈ కుంభకోణం బయటపడకముందే భారత్‌ను వదిలి వెళ్లిన ఆయన 2018 నుంచి ఆంటిగ్వాలోనే ఉంటున్నారని చెప్పారు. మరోవైపు నీరవ్ మోదీని 2019లో ఎఫ్ఈఓగా ప్రకటించారు. ప్రస్తుతం ఆయన లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ఉన్నారు. చోక్సీ ఆరోగ్య సమస్యల నేపథ్యంలో రాబోయే విచారణలో ఆయనను ఎఫ్ఈఓగా ప్రకటించడంపై కోర్టు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఎఫ్ఈఓగా ప్రకటిస్తే తన ఆస్తులను ప్రభుత్వం వేలం వేసి నష్టాన్ని భర్తీ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే మెహుల్ చోక్సీ ఈక్విటీ ఆస్తులకు సంబంధించి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. చోక్సీ బ్యాంకు ఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్‌లను జప్తు చేసింది.

# కొత్త ఆదాయ పన్ను బిల్లులో ట్యాక్స్ ఇయర్?

పార్లమెంటులో త్వరలో ప్రవేశపెట్టనున్న కొత్త ఆదాయపు పన్ను బిల్లు సామాన్యులకు ప్రత్యక్ష పన్ను చట్టాలను సులభతరం చేయడమే లక్ష్యంగా రూపొందించినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. బిల్లులో ప్రతిపాదించిన కీలక మార్పుల్లో 'ట్యాక్స్ ఇయర్' ఒకటని సమాచారం. ఈ మార్పు వల్ల వ్యాపారుల పన్ను చెల్లింపులను సులభతరం చేసేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.

**టాక్స్ ఇయర్ అంటే ఏమిటి?**

టాక్స్ ఇయర్ అనేది నిర్దిష్ట ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను ప్రయోజనాల కోసం ఉపయోగించే 12 నెలల వ్యవధి. కొత్త ఆదాయపు పన్ను బిల్లు ప్రకారం ట్యాక్స్ ఇయర్ ఏప్రిల్ 1న ప్రారంభమై మరుసటి ఏడాది మార్చి 31న ముగుస్తుంది. 1961 ఆదాయపు పన్ను చట్టంలో ఉపయోగించిన 'ప్రివియస్ ఇయర్', 'అసెస్‌మెంట్ ఇయర్(మదింపు సంవత్సరం)' స్థానంలో ఈ ట్యాక్స్ ఇయర్‌ను వాడనున్నారు.

**పన్ను చట్టాలను ఎలా సులభతరం చేస్తుంది?**


స్థిరమైన ట్యాక్స్ ఇయర్‌ను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా పన్ను చెల్లింపుదారులు ఆదాయాన్ని నివేదించడానికి, పన్నులు చెల్లించడానికి నిర్దిష్ట వ్యవధిని కలిగి ఉంటారు. ఇది విభిన్న ఆర్థిక సంవత్సరాలకు వేర్వేరు అసెస్‌మెంట్ ఇయర్(మదింపు సంవత్సరంవచ్చే ఆర్థిక సంవత్సరం)లను కలిగి ఉండటం వల్ల తలెత్తే గందరగోళాన్ని తొలగిస్తుంది. పన్ను చెల్లింపుదారులు తమ బాధ్యతలను అర్థం చేసుకోవడానికి సులభమైన, స్పష్టమైన భాషను ఉపయోగించాలని కొత్త బిల్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన కాలం చెల్లిన నిబంధనలు, వివరణలను తొలగించాలని నిర్ణయించారు. పన్ను విధానాలకు సంబంధించి స్పష్టమైన నిర్వచనాలు, క్రమబద్ధమైన విధానాతతో కొత్త పన్ను చట్టాలు వివాదాలు, లిటిగేషన్లను తగ్గిస్తాయని భావిస్తున్నారు. దీనివల్ల మరింత పన్ను వసూలుకు వీలవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పన్నుకు సంబంధించి వివాదాలు తగ్గడం వల్ల న్యాయవ్యవస్థపై భారం తగ్గుతుందని చెబుతున్నారు. తరచూ శాసన పరమైన సవరణలు అవసరం లేకుండా పన్ను పథకాలను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)కి ఎక్కువ అధికారాన్ని ఈ బిల్లు కల్పిస్తుంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ భూతం.. డంబెల్స్ వేలాడదీసి





**తిరువనంతపురం :** 'అరె తమ్ముళ్లు మందేయాలి. డబ్బులు ఇవ్వండ్రా అని సీనియర్ విద్యార్థులు.. తమ జూనియర్ విద్యార్థులకు హుకుం జారీ చేశారు. దీంతో జూనియర్లు చేసేది లేక కొన్ని వారాల పాటు ప్రతి ఆదివారం సీనియర్లకు డబ్బులు ఇచ్చే వారు. ఈ తరుణంలో ఓ ఆదివారం ఎప్పటిలాగే జూనియర్ల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు సీనియర్లు ప్రయత్నించారు. దీంతో జూనియర్లు మీకు ఇచ్చేందుకు మా దగ్గర డబ్బులు లేవు అన్నా'అని సమాధానం ఇచ్చారు. అంతే కోపోద్రికులైన సీనియర్ విద్యార్థులు.. జూనియర్లను అత్యంత కిరాతంగా ర్యాగింగ్ చేశారు. చివరికి.. కేరళ పోలీసులు వివరాల మేరకు.. కేరళ రాజధాని తిరువనంతపురంకు చెందిన ముగ్గురు విద్యార్థులు కొట్టాయంలో ప్రభుత్వ కాలేజీలో నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. అయితే, గతేడాది నవంబర్‌లో మూడో సంవత్సరం నర్సింగ్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఈ ముగ్గురు విద్యార్థుల్ని ర్యాగింగ్ పేరుతో వేధింపులకు గురిచేశారు. ఆ ర్యాగింగ్ ఎలా ఉందంటే? బాధితుల్ని నగ్నంగా నిలబెట్టి గాయపరచడం. వాటిపై కారం పూయడం. మంటకు విలవిల్లాడుతుంటే వీడియోలు తీసి పైశాచికానందం పొందడం. గాయాల్ని కంపాస్‌తో కొలవడం. అంతర్గత అవయవాలకు డంబెల్స్‌ను వేలాడదీయడం వంటి వికృత చేష్టలకు దిగారు. తాము ర్యాగింగ్ చేస్తున్నామని ఫిర్యాదు చేస్తే మీకు చదువును దూరం చేస్తామని బాధిత విద్యార్థుల్ని బెదిరింపులకు దిగారు. అలా నాలుగు నెలల పాటు సీనియర్ల వేధింపులను మౌనంగా భరించారు. ఈ నేపథ్యంలో ఓ బాధిత విద్యార్థి ధైర్యం చేసి కాలేజీలో జరిగిన దారుణం వెలుగులోకి వచ్చింది. తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సీనియర్ విద్యార్థుల్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు కస్టడీలో విద్యార్థుల్ని పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

# ఉచితాలపై సుప్రీం కోర్టు సీరియస్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** ఉచితాలపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో ఉచితాలను ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. రాజకీయ పార్టీలు ప్రజలను పరాన్న జీవులుగా మార్చేస్తున్నాయని మండిపడింది. పట్టణాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన ఓ పిటిషన్‌ను జస్టిస్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఉచితాలపై వ్యాఖ్యానించింది. ఉచితంగా రేషన్, ఉచితంగా నగదు అందుతున్నందున ప్రజలు పని చేయడానికి ఇష్టపడం లేదని వ్యాఖ్యానించింది. ఉచితాలతో ఏ పని చేయకుండా ప్రజలు ఆహారం, డబ్బు సంపాదిస్తున్నారని పేర్కొంది. ''ఇలా అంటున్నందుకు క్షమించాలి. ఇలాంటి వ్యక్తులను(ఉచితాలను అందుకుంటున్న వాళ్లను) సమాజ పురోగతిలో భాగం చేయకుండా.. పరాన్నజీవుల తరగతిని మనం సృష్టించడం లేదా?. ఎన్నికల సమయంలో ఉచితాలను ప్రకటించడం వల్ల.. పని చేసేందుకు జనం ఇష్టపడడం లేదు. ఎలాంటి పనులు చేయకుండానే ఉచితంగా రేషన్ వాళ్లకు అందజేస్తున్నారు'' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. అయితే పట్టణాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కలిపించే అంశం కేంద్రం పరిశీలనలో ఉందని అటార్నీ జనరల్ వెంకటరమణి కోర్టుకు తెలిపారు. ఈ అంశం పరిశీలనకు కేంద్రం ఎంత సమయం తీసుకుంటుందో వివరణ ఇవ్వాలని అటార్నీ జనరల్‌ను ఆదేశించిన బెంచ్.. పిటిషన్ విచారణను ఆరువారాల పాటు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. ఉచితాల(freebies)పై దేశ సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేయడం ఇదేం కొత్త కాదు. కిందటి ఏడాది డిసెంబర్‌లోనూ ఇదే తరహాలో తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దేశంలో 81 కోట్ల మంది ఉచితంగా రేషన్, సబ్సిడీల కింద రేషన్ అందుకుంటున్నారనే విషయం కోర్టు దృష్టికి వెళ్లింది. ''ఇలా ఎంత కాలం ఉచితాలు ఇస్తూ పోతారు? వాళ్లకు ఉపాధి కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేమా?'' అని జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఆనాడు వ్యాఖ్యానించింది.

**'సుప్రీం'కే వెళ్లండి: ఢిల్లీ హైకోర్టు**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా.. ఆప్, బీజేపీ, కాంగ్రెస్‌లు పోటాపోటీగా ఉచితాల హామీలు ఓటర్లపై గుప్పించాయి. అయితే ఇది అవినీతి చర్యల కిందకే వస్తుందని మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎన్ ధింగ్రా ఢిల్లీ హైకోర్టు(Delhi High Court)లో ఓ పిటిషన్ వేశారు. అయితే బుధవారం ఈ పిటిషన్‌ను పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం.. సుప్రీం కోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచించింది. ప్రజా ప్రతినిధుల చట్టం ప్రకారం.. ఉచితాలు ప్రకటించడం అవినీతి కిందకే వస్తుందని మాజీ న్యాయమూర్తి ధింగ్రా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మూడు పార్టీలు పోటాపోటీగా ప్రజలకు లంచం ఎర వేశాయి. ఈ వ్యవహారంపై ఈసీని దర్యాప్తునకు ఆదేశించాలని, అలాగే అలాంటి ప్రకటనలు చేసిన వాళ్లు రాజ్యాంగం ప్రకారం అనర్హులుగా ప్రకటించాలని ఆయన కోరారు. అదేవిధంగా.. ఓటర్ల వివరాలను సేకరించడం, వాటిని థర్డ్ పార్టీకి ఇవ్వడం అడ్డుకోవాలని ఆయన తన పిటిషన్‌లో ప్రస్తావించారు. అయితే.. పిటిషన్‌ను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు.. సుప్రీం కోర్టులో ఇదే తరహా పిటిషన్‌పై విచారణ జరుగుతున్నందున అక్కడికే వెళ్లాలని ఆయనకు సూచించింది.



# అక్షరాలు దిద్దుతున్న కుంభమేళా మోనాలిసా

కుంభమేళాకు పూసల దండలు అమ్ముకునేందుకు వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన మోనాలిసా తన అందమైన తేనెకళ్ల కారణంగా రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్ అయిపోయింది. ఒక్కదెబ్బతో ఈమె ఖాతాలోకి లెక్కలేనంతమంది అభిమానులు చేరిపోయారు. ఇదే నేపథ్యంలో మోనాలిసా ఒక సినిమా అవకాశాన్ని, ఒక ప్రకటనలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. నిరక్షరాస్యురాలైన మోనాలిసా ఇప్పుడు అక్షరాలు దిద్దేపనిలో పడింది. ఇంటర్నెట్ సన్సేషన్‌గా మారిన మోనాలిసా ఏనాడూ పాఠశాలకు వెళ్లి చదువుకోలేదు. అయితే ఇప్పుడు ఆమెకు చదువు అవసరం ఏర్పడింది. దీనిని గుర్తించిన దర్శకుడు సనోజ్ మిశ్రా ఆమెకు చదువు నేర్పించే బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకున్నారు. ఇటీవల ఆయన షేర్ చేసిన ఒక వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో మోనాలిసా హిందీలో అక్షరాలు దిద్దుతున్నట్లు కనిపిస్తోంది. స్లేట్ పెన్సిల్ తీసుకుని, మోనాలిసా అక్షరాలు దిద్దటాన్ని మనం ఆ వీడియోలో చూడవచ్చు. ఎవరూ ఊహించని విధంగా మోనాలిసా జీవితం మారిపోయింది. ఒకవైపు సినిమా అవకాశాలు దక్కించుకుంటూనే, మరోవైపు అక్షర జ్ఞానాన్ని కూడా మోనాలిసా పెంపొందించుకుంటోంది. ఆమె నటిస్తున్న చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్' షూటింగ్ త్వరలోనే ప్రారంభంకానున్నదని సమాచారం.



# రాజ్యసభకు కమల్ హాసన్?

సీనియర్ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే చర్చ తమిళనాట జోరుగా నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమికి మద్దతు ప్రకటించిన ఆయన.. డీఎంకే అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 39 సీట్లను కూటమి కైవసరం చేసుకుంది. దీంతో ఆయన్ను పెద్దల సభకు నామినేట్ చేయాలని డీఎంకే భావిస్తోందన్నది ఆ ప్రచార సారాంశం. ఈ ఏడాది జూన్‌లో రాజ్యసభ నుంచి ఆరు సీట్లు ఖాళీ కానున్నాయి. అయితే ఎన్నికల్లో మద్దతు ప్రకటించిన కమల్‌ను రాజ్యసభకు పంపే యోచనలో డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ ఉన్నారట. తాజాగా.. బుధవారం తమిళనాడు మంత్రి పీకే శేఖర్‌బాబు కమల్ హాసన్ నివాసానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. మరోవైపు కమల్ పార్టీ మక్కల్ నీది మయ్యమ్(MNM) ప్రతినిధి మురళి అప్పాస్.. తమ పార్టీకి ఓ రాజ్యసభ సీటు దక్కబోతుందనే విషయాన్ని ధృవీకరించారు. అయితే అది ఎవరనేది పార్టీ అధ్యక్షుడు కమల్ హాసనే నిర్ణయిస్తారని తెలిపారాయన. శేఖర్‌బాబుతో కమల్ జరిపిన చర్చల సారాంశాన్ని ఆయన మీడియాకు వివరించేందుకు నిరాకరించారు. 2018, ఫిబ్రవరి 21వ తేదీన కమల్ హాసన్ ఎన్ఎంఎం పార్టీని మధురైలో స్థాపించారు. అప్పటి నుంచి ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రభావం చూపెట్టలేకపోయింది. 2019 సార్వత్రిక ఆయన పార్టీ పోటీ చేసినప్పటికీ.. ఆశించిన ఫలితం సాధించలేకపోయింది. అయితే.. ఓటు షేర్ మాత్రం 3.72 శాతం దక్కించుకుంది. మరీ ముఖ్యంగా చెన్నై, కోయంబత్తూరు, మధురైలో భారీగా ఓట్లు పడ్డాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేసినా.. ఒక్క సీటు గెలవలేకపోయింది. కోయంబత్తూరులో పోటీ చేసిన కమల్.. బీజేపీ అభ్యర్థి వనతిశ్రీనివాసన్ చేతిలో 1,728 ఓట్ల మెజారిటీలోఓటమి పాలయ్యారు. 2022 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసినా.. 140 స్థానాలకు ఒక్కటి కూడా గెలవలేకపోయింది.



# సీనియర్ హీరోతో రష్మికకు గోల్డెన్ ఛాన్స్

కోలీవుడ్ స్టార్ హీరో రజనీకాంత్ మరోసారి బాలీవుడ్ చిత్రంలో నటించనున్నారా..? అన్న ప్రశ్నకు కోలీవుడ్ వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. ప్రస్తుతం ఈయన లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో కూలీ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. నటి శృతిహాసన్ ముఖ్యపాత్రను పోషిస్తున్న ఈ చిత్రం చివరి దశకు చేరుకుంది. తదుపరి నెల్సన్ దర్శకత్వంలో జైలర్- 2 చిత్రం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాంటిది తాజాగా రజనీకాంత్ ఓ హిందీ చిత్రంలో నటించటానికి పచ్చజెండా ఊపినట్లు సమాచారం. విశేషం ఏమిటంటే ఇందులో కథానాయకగా నేషనల్ క్రష్ రష్మిక మందన్నను నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే పలు హిందీ చిత్రాల్లో ఆమె నటించారు. తాజాగా సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న సికిందర్ చిత్రంలో రష్మిక నటిస్తున్నారు. కోలీవుడ్ స్టార్ దర్శకుడు మురగదాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను మార్చి నెలలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా తాజాగా సల్మాన్ ఖాన్, రష్మిక మందన్న జంటగా మరో చిత్రంలో నటించటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి దర్శకుడు అట్లీ తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. కాగా ఈ క్రేజీ చిత్రంలోనే రజనీకాంత్ కూడా ఒక ముఖ్యపాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ పాత్రలో ముందుగా నటుడు కమల్ హాసన్ నటింపజేసే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. అయితే, ఆయన నిరాకరించడంతో, ఇప్పుడు రజనీకాంత్ ను నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అట్లీ ఇంతకుముందు రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన ఎందిరన్ (రోబో) చిత్రానికి సహాయ దర్శకుడిగా పని చేశారు. ఆ పరిచయంతో ఇప్పుడు తాను దర్శకత్వం వహించబోయే హిందీ చిత్రంలో రజనీకాంత్‌ను ముఖ్యపాత్రలో నటింపజేయనున్నట్లు తెలుస్తోంది. అలా సల్మాన్ ఖాన్, రజనీకాంత్, రష్మిక మందన్నలతో రేర్ కాంబినేషన్లో చిత్రాన్ని చేయడానికి అట్లీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీని షూటింగ్ ఈ ఏడాదిలోనే ప్రారంభం కాబోతున్నట్లు తెలిసింది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలవడ లేదు.

# ఇండస్ట్రీ ప్లే బాయ్‌తో చెయ్యి కలపనున్న సాయి పల్లవి



సాయిపల్లవికి నటిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. వచ్చిన అవకాశాలన్నింటినీ ఒప్పేసుకోవడం ఈమె నైజం కాదు. కథ, అందులో తన పాత్ర నచ్చితేనే నటించడానికి పచ్చజెండా ఊపుతారు. అదీ తన పాత్రకు ప్రాధాన్యత ఉండాలి. ఇకపోతే గ్లామరస్‌గా ఉండకూడదు. అలాంటి పాత్రల్లో నటిస్తూనే వరుస విజయాలను అందుకుంటున్నారు. ఇటీవల శివకార్తికేయన్‌కు జంటగా అమరన్ చిత్రంలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. అదేవిధంగా తాజాగా నాగచైతన్య సరసన తండేల్ చిత్రంలో నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రస్తుతం హిందీలో రామాయణం చిత్రంలో సీత పాత్రలో నటిస్తున్నారు. కాగా తాజాగా మరో కోలీవుడ్ చిత్రం కోసం సాయిపల్లవి పేరు వినిపిస్తోంది. అదీ సంచలన నటుడు శింబుతో జత కట్టే విషయమై ప్రచారం జోరందుకుంది. శింబు ఇప్పుడు నటుడు కమలహాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో నటించిన థగ్‌లైఫ్ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించారు. ఈ చిత్రం జూన్‌లో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. కాగా తాజాగా వరుసగా మూడు చిత్రాల్లో నటించడానికి శింబు సిద్ధం అవుతున్నారు. అందులో ఒకటి పార్కింగ్ చిత్రం ఫేమ్ రామ్‌కుమార్ దర్శకత్వం వహించనున్న చిత్రం. డాన్ పిక్చర్స్ పతాకంపై ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల నటుడు శింబు పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. అందులో శింబు చేతిలో ఉన్న పుస్తకంలో రక్తం మరకలు కలిగిన కత్తి ఉండడంతో ఇది యాక్షన్ ఎంటర్‌టెయినర్ కథా చిత్రంగా ఉంటుందని తెలుస్తోంది.

### సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా..

ఈ చిత్రంలో కథానాయకిగా నటి సాయిపల్లవి నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా మరో ముఖ్య పాత్రలో నటుడు సంతానం నటించనున్నట్లు టాక్ వైరల్ అవుతోంది. హాస్య నటుడిగా పరిచయం అయి, ఆ తరువాత కథానాయకుడిగా రాణిస్తున్న సంతారం ఈ చిత్రం ద్వారా మళ్లీ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇకపోతే శింబు నటించిన గత సినిమాలను పరిశీలిస్తే ఎక్కువగా హీరోయిన్‌తో రొమాంటిక్ సీన్స్ లేదా సాంగ్స్ ఉండటం సహజం. కోలీవుడ్ ప్లే బాయ్ అనే ట్యాగ్‌లైన్ కూడా ఆయనకు ఉంది. నయనతార,హన్సిక,ఆండ్రియా, హర్షిక,త్రిష,సనా ఖాన్ వంటి వారితో ఆయనకు ఎఫైర్స్ ఉన్నాయంటూ కోలీవుడ్‌లో వార్తలు కూడా వచ్చాయి. అయితే, సింబు సినిమాలో సాయి పల్లవి నటించడానికి సమ్మతించారా..? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. నిజంగా ఆమె అంగీకరించినట్లయితే అందులో ఆమె పాత్ర స్ట్రాంగ్ అయ్యి ఉంటుందని భావించవచ్చు. కాగా ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. కాగా ఇది శింబు నటించనున్న 49వ చిత్రం అన్నది గమనార్హం.



# చిక్కుల్లో చిరంజీవి

- లింగ వివక్ష వ్యాఖ్యలపై మహిళా లోకం భగ్గు
- వారసత్వం అంటే మగపిల్లలేనా అంటూ మండిపాటు
- ఇంట్లో ఆడపిల్లలు ఉంటే లేడీస్ హాస్టల్ లా ఉందా? అంటూ ఆగ్రహం

**మహా, హైదరాబాద్:** సినీనటుడు చిరంజీవి చేసిన లింగ వివక్ష వ్యాఖ్యలపై మహిళా లోకం భగ్గు మంటోంది. ఒక పక్క ప్రధాని నరేంద్రమోదీ 'భేటి బచావో భేటి పడావో' అంటూ ముందుకు వెళ్తుంటే.. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం ఏమిటని మండిపడుతున్నారు. చిరంజీవి లాంటి వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఇక సమాజంలో లింగ వివక్ష ఎప్పటికి పోతుందని అంటున్నారు. చిరంజీవి వ్యాఖ్యలపై మహిళా కమిషన్‌కి కూడా ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు.

### వారసుడు అంటే కొడుకే అవుతాడా?


వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల చిరంజీవి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. కేవలం కొడుకునే వారసుడు అనడం సబబు కాదని అన్నారు. కూతురిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించారు. 'మహిళలు ఇంత అభివృద్ధి చెందుతూ, ఇంత ముందుకు నడుస్తున్న ఈ రోజుల్లో కూడా ఇలాంటి ఆలోచనలు సరికాదు. వాళ్లింట్లో వాళ్ల కోడలు ఉపాసన గారినే చూస్తే... ఓ డైనమిక్ లేడీ, డైనమిక్ ఉమన్.. ఓ సంస్థను ఆమె ఎంత చక్కగా నడిపిస్తున్నారో తెలిసిందే కదా. ఉపాసన వాళ్ల మదర్ కానీ, వాళ్ల సిస్టర్స్ కానీ ఎంత ఎదిగారో తెలిసిందే. అందుకే, వారసుడు అంటే ఎవరైనా అవ్వొచ్చు... కొడుకే కానక్కర్లేదు... అనేది నా అభిప్రాయం. చిరంజీవి ఏ ఉద్దేశంతో అన్నారో నాకు తెలియదు" అని శ్యామల వివరించారు.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# సౌదీ అరేబియాలో ఇ-స్పోర్ట్స్ ఒలింపిక్స్

OLYMPIC ESPORTS


**లుసానే (స్విట్జర్లాండ్):** మొట్టమొదటి ఒలింపిక్స్ ఇ-స్పోర్ట్స్‌కు సౌదీ అరేబియా ఆతిథ్యమివ్వబోతోంది. 2027లో సౌదీ రాజధాని రియాద్‌లో ఎలక్ట్రానిక్ స్పోర్ట్స్ విశ్వక్రీడలు జరుగనున్నాయి. గతేడాది పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా ఈ ఏడాదే ఇ-స్పోర్ట్స్ మెగా ఈవెంట్ నిర్వహించాలని మొదట అనుకున్నారు. అయితే ఇది కార్యరూపం దాల్చేందుకు ఇంకో రెండేళ్లు ఆలస్యమవుతుంది. అయితే 2027 నుంచి రెగ్యులర్‌గా ప్రతీ రెండేళ్లకోసారి మెగా ఈవెంట్ ఇ-స్పోర్ట్స్ నిర్వహించేందుకు సౌదీ ప్రభుత్వం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)తో 12 ఏళ్ల ఒప్పందం చేసుకుంది. గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో రియాద్‌లో ఇ-స్పోర్ట్స్ ప్రపంచకప్ జరిగింది. కాల్ ఆఫ్ డ్యూటీ, ఫోర్ట్‌నైట్, స్ట్రీట్ ఫైటర్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అయితే ఇందులో సాధారణ షూటర్లకు అనుమతించేది లేనిది తేలలేదు. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుంది. సౌదీ క్రీడల మంత్రి ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ తుర్కీ అల్ ఫైజల్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ ఒలింపిక్స్ ఇ-స్పోర్ట్స్ క్రీడాంశాలపై చర్చించనుంది. ఇటీవల ఐఓసీ చైర్మన్ థామస్ బాచ్, సౌదీ రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌ల మధ్య చర్చలు ఫలప్రదంగా జరగడంతో తాజాగా ఇ-స్పోర్ట్స్ విశ్వక్రీడలపై ప్రకటన వెలువడింది. అయితే ఇంకో రెండేళ్లలో జరిగే ఈ పోటీల కోసం ఈ ఏడాది నుంచే క్వాలిఫయింగ్ పోటీలు మొదలవుతాయని ఐఓసీ వర్గాలు తెలిపాయి.



# 36వ సారి జాతీయ టైటిల్ సాధించిన పంకజ్ అద్వానీ

**ఇండోర్:** భారత స్టార్ క్యూయిస్ట్, ప్రపంచ చాంపియన్ పంకజ్ అద్వానీ తన ఖాతాలో 36వసారి జాతీయ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. మంగళవారం జరిగిన 91వ జాతీయ స్నూకర్ చాంపియన్‌షిప్ ఫైనల్లో పంకజ్ 5-1 ఫ్రేమ్‌ల తేడాతో బ్రిజేశ్ దమానిపై నెగ్గాడు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో పంకజ్‌తో పాటు బ్రిజేశ్ జాతీయ జట్టు తరఫున ఆడే అవకాశం దక్కించుకున్నారు. 'అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే అవకాశం ఇచ్చే ఈవెంట్ ఇదొక్కటే కావడంతో... తీవ్ర పోటీ ఎదురైంది. గ్రూప్ దశలో పేలవ ప్రదర్శన అనంతరం తిరిగి పుంజుకొని స్వర్ణం నెగ్గడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉంది' అని పంకజ్ అన్నాడు.

# ఆస్ట్రేలియాను చిత్తు చేసిన శ్రీలంక..



ఛాంపియన్స్ ట్రోఫీ2025 సన్నాహకాలను ఘనంగా ఆరంభించాలని భావించిన ఆస్ట్రేలియాకు శ్రీలంక ఊహించని షాకిచ్చింది. కొలంబో వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో 49 పరుగుల తేడాతో శ్రీలంక ఘన విజయం సాధించారు. 215 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని చేధించలేక ఆసీస్ 33.5 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. లంక స్పిన్నర్ల దాటికి ఆసీస్ బ్యాటర్లు విల్లవిల్లాడారు. స్టీవ్ స్మిత్, లబుషేన్ వంటి స్టార్ ఆటగాళ్లు సైతం ప్రత్యర్థి స్పిన్నర్ల ముందు తేలిపోయారు. వచ్చిన వారు వచ్చినట్టగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. శ్రీలంక బౌలర్లలో మహేష్ థీక్షణ నాలుగు వికెట్లు పడగొట్టగా.. దునిత్ వెల్లలాగే, అసితా ఫెర్నాండో తలా రెండు వికెట్లు సాధించారు. వీరిద్దరితో పాటు కెప్టెన్ అసలంక, హసరంగా చెరో వికెట్ సాధించారు. ఆస్ట్రేలియా బ్యాటర్లలో అలెక్స్ క్యారీ(41) టాప్ స్కోరర్‌గా నిలవగా.. హార్డీ(32), సీన్ అబాట్(20) పర్వాలేదన్పించారు. కమ్మిన్స్, స్టార్క్, మాక్స్‌వెల్ వంటి స్టార్ ప్లేయర్లు లేని లోటు ఈ మ్యాచ్‌లో కన్పించింది.

### అసలంక విరోచిత సెంచరీ..

అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది. అయితే లంక కెప్టెన్ చరిత్ అసలంక మాత్రం విరోచిత పోరాటం కనబరిచాడు. సహచరులందరూ విఫలమైన చోట అసలంక అద్భుతమైన సెంచరీతో మెరిశాడు. 126 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్సర్లతో అసలంక 127 పరుగులు చేశాడు. అతడితో పాటు దునిత్ వెల్లలాగే(30) కీలక పరుగులు సాధించారు. మిగతా ఆటగాళ్లంతా తీవ్ర నిరాశపరిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో సీన్ అబాట్ మూడు వికెట్లు పడగొట్టగా.. నాథన్ ఈల్లీస్, జాన్సన్, హార్దే తలా రెండు వికెట్లు సాధించారు. ఇక ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఫిబ్రవరి 14న ఇదే వేదికలో జరగనుంది. కాగా ఇంతకుముందు రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను ఆసీస్ క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. రెండో వన్డే అనంతరం ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు పాకిస్తాన్‌కు ఆస్ట్రేలియా పయనం కానుంది. అయితే ఈ మెగా టోర్నీకి ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ పాటు జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, మార్ష్ వంటి స్టార్ ప్లేయర్లు గాయం కారణంగా దూరమయ్యాడు. తాజాగా ఈ ఈవెంట్ కోసం అప్‌డేటడ్ జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది.

# చరిత్ర సృష్టించిన కోహ్లీ..

## భారత తొలి బ్యాటర్‌గా అరుదైన రికార్డు



అహ్మదాబాద్ వన్డే సందర్భంగా టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సరికొత్త చరిత్ర సృష్టించాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి ఇంగ్లండ్‌పై అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. ఓవరాల్‌గా ఈ జాబితాలో కోహ్లి ఆరో స్థానంలో ఉన్నాడు. కాగా గత కొంతకాలంగా కోహ్లి వరుస వైఫల్యాలతో సతమవుతున్న విషయం తెలిసిందే. గత పన్నెండు ఇన్నింగ్స్‌లో అతడు చేసిన పరుగులు వరుసగా 4, 1, 5, 100*, 7, 11, 3, 36, 5, 17, 6, 6. ఈ క్రమంలో సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్(India vs England)లోనైనా కోహ్లి ఫామ్‌లోకి వస్తాడని భావిస్తే.. మోకాలి గాయం కారణంగా నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు.

### కేవలం ఐదు పరుగులు

అనంతరం కటక్‌లో జరిగిన రెండో వన్డేతో పునరాగమనం చేసిన కోహ్లి పూర్తిగా విఫలమయ్యాడు. ఎనిమిది బంతులు ఎదుర్కొని ఒక ఫోర్ సాయంతో కేవలం ఐదు పరుగులు చేసి నిష్క్రమించాడు. ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో ఫిల్ సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి వికెట్ కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో అహ్మదాబాద్ వేదికగా మూడో వన్డేలోనైనా బ్యాట్ ఝులిపిస్తాడని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో కోహ్లి ఓ అరుదైన ఘనత సాధించడం విశేషం. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్‌పై నాలుగు వేల పరుగులు పూర్తి చేసుకున్న తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. కాగా కోహ్లి ఇంగ్లండ్‌పై ఇప్పటి వరకు ఎనిమిది శతకాలు బాదడంతో పాటు 23 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. సగటు 41.23.

### హాఫ్ సెంచరీతో మెరిసిన కోహ్లి

ఇదిలా ఉంటే.. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా ఇప్పటికే 20తో సొంతం చేసుకుంది. ఇరుజట్ల మధ్య బుధవారం నాటి నామమాత్రపు మూడో వన్డేకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఇందుకు వేదిక. ఇందులో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుని భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే, ఆదిలోనే టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్క పరుగు మాత్రమే చేసి అవుటయ్యాడు. మార్క్ వుడ్ బౌలింగ్‌లో ఫిల్ సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. మరోవైపు.. వన్‌డౌన్ బ్యాటర్ కోహ్లి(52), ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ఇద్దరూ అర్ధ శతకాలు పూర్తి చేసుకున్నారు. ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చిన కోహ్లి అవుటయ్యాడు.

### అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్‌పై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లు

1. డాన్ బ్రాడ్‌మన్(ఆస్ట్రేలియా) 63 ఇన్నింగ్స్‌లో 5028 పరుగులు
2. అలెన్ బోర్డర్(ఆస్ట్రేలియా) 124 ఇన్నింగ్స్‌లో 4850 పరుగులు
3. స్టీవ్ స్మిత్(ఆస్ట్రేలియా) 114 ఇన్నింగ్స్‌లో 4815 పరుగులు
4. వివియన్ రిచర్డ్స్(వెస్టిండీస్) 84 ఇన్నింగ్స్‌లో 4488 పరుగులు
5. రిక్కీ పాంటింగ్(ఆస్ట్రేలియా) 99 ఇన్నింగ్స్‌లో 4141 పరుగులు
6. విరాట్ కోహ్లి(ఇండియా)109 ఇన్నింగ్స్‌లో 4001కి పైగా పరుగులు.

# చెస్ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** యువ ఆటగాళ్లు కెరీర్‌లో ఎదిగేందుకు ప్రోత్సాహకంగా ఇప్పటి వరకు అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని ఆపివేయాలని ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై అంతర్జాతీయ ఈవెంట్లలో విజయాలు సాధిస్తేనే నగదు పురస్కారాలు లభిస్తాయి. చెస్‌లో గ్రాండ్‌మాస్టర్‌గా (జీఎం) మారితే రూ. 4 లక్షలు, ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) సాధిస్తే రూ.1.5 లక్షలు ఇచ్చేవారు. అయితే వీటిని నిలిపివేయడం సరైన నిర్ణయం కాదని అగ్రశ్రేణి ఆటగాడు అర్జున్ ఇరిగేశి అభిప్రాయపడ్డాడు. 'చెస్‌లో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న వర్ధమాన ఆటగాళ్లకు ఈ సమస్య అర్థం కాకపోవచ్చు. కానీ వారిని ప్రోత్సహించే తల్లిదండ్రులకు మాత్రం ఈ నిర్ణయం తీవ్ర నిరాశ కలిగిస్తుంది. దీని వల్ల వారికి ఆర్థికపరమైన సమస్యలు వస్తాయి. డబ్బుల కోసం ప్రత్యామ్నాయాలు చూడాల్సి వస్తుంది. పిల్లలను ప్రోత్సహించాలనే ప్రేరణ తగ్గిపోతుంది. సరిగ్గా చెప్పాలంటే చెస్, చదువులో ఏదైనా ఎంచుకోవాల్సి వస్తే వారు ఆటను పక్కన పెట్టవచ్చు' అని అర్జున్ వ్యాఖ్యానించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com